## దేశవ్యాప్తంగా ఆయుష్ కేంద్రాలు

**- ఈఏడాది 4వేల కేంద్రాల ఏర్పాటే లక్ష్యం**

**- ప్రధాని నరేంద్ర మోదీ**

న్యూఢిల్లీ,ఆగస్టు30(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఆయుష్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. శుక్రవారం ఆయన ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన యోగా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఆయుష్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే 12,500 ఆయుష్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. శుక్రవారం ఒక్కరోజే 10ఆయుష్ కేంద్రాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే ఈ ఏడాదిలో దేశంలో 4000 కేంద్రాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. ఒకే దేశం ఒకే పన్ను, ఒకే దేశం ఒకే మొబిలిటీ కార్డు తరహాలోనే ఆయుష్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 31-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 24 పేజీలు 8 వెల: రూ.1/-


# నగరవాసులకు మరింత ఆహ్లాదం

**అందుబాటులోకి వచ్చిన మరో రెండు అర్బన్ పార్కులు**

**లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు**

**పర్యావరణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు**

హైదరాబాద్,ఆగస్టు30 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్ వాసులకు మరో రెండు అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లు అందుబాటులోకి



వచ్చాయి. మేడ్చల్ జిల్లాలోని దమ్మాయిగూడలో ఆరోగ్య వనం, మేడిపల్లిలో జటాయువు అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లను అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఇంద్రరణ్ రెడ్డి మాట్లాడుతూ..ఒత్తిడిని అధిగమించేందుకు, యాంత్రిక జీవనం నుంచి కొద్దిసేపు ఆటవిడుపుగా గడిపేందుకు అర్బన్ ఫారెస్ట్ పార్కులు దోహదం చేస్తాయన్నారు. నగరంలో స్వచ్ఛమైన గాలి లభించడం గగనమైపోయింది. ఇలాంటి తరుణంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ కు నలువైపులా 'అర్బన్ లంగ్ స్పేస్' పేరుతో రిజర్వు ఫారెస్టులను అభివృద్ధి చేస్తుంది. పర్యాటకులు సైతం సందర్శించేందుకు వీలుగా పార్క్‌ల్లో అదనపు హంగులు సమకూరుస్తున్నామని తెలిపారు. దమ్మాయిగూడలో 298 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాను అభివృద్ధి చేశారని మంత్రి ఇంద్రకరణ్ తెలిపారు. రూ.74.424 లక్షలతో గజీబా, కూర్చునేందుకు వీలుగా బెంచ్ లు, వాటర్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్స్, యోగా షెడ్, వాకింగ్ ట్రాక్ లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వ్యూ పాయింట్ నుంచి చూస్తే మొత్తం అర్బన్ పార్కు వ్యూ తోపాటు నగరం వ్యూ కూడా కనిపించేలా నిర్మాణం చేసినట్లు వెల్లడించారు. భవిష్యతులో మరిన్ని నిధులు కేటాయించి ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. పార్క్ లు ఆహ్లాదకరంగా ఉండేలా స్థానికులు కూడా తోడ్పాటునందించాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం అడవులను పెంచడం, అటవీ భూముల రక్షణకు పెద్దపీట వేస్తుందన్నారు. హరితహారం కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నామని తెలిపారు. చెట్లను రక్షిస్తే..చెట్లు మనల్ని రక్షిస్తాయన్నారు.

అడవుల రక్షణకు ముఖ్యమంత్రి కేసీఆర్ అధిక ప్రాధన్యతనిస్తున్నారన్నారని మంత్రి మల్లారెడ్డి స్పష్టం చేశారు. నగరవాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఈ పార్కుల్లో ఫుడ్ కోర్ట్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ గేమ్ జోన్ ఏరియా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదంగా గడపడానికి టూరిజం స్పాట్‌గా ఈ పార్కులను తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ ఆర్.శోభ, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి, అదనపు పీసీసీఎఫ్ లు స్వర్గం శ్రీనివాస్, ప్గ్గ÷యిన్, చంద్రశేఖర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, ఇతర అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భవిష్యత్తు లో మరిన్ని నిధులు కేటాయించి ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. పార్క్ లు ఆహ్లాదకరంగా ఉండేలా స్థానికులు కూడా తోడ్పాటునందించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం అడవులను పెంచడం, అటవీ భూముల క్షణకు పెద్దపీట వేస్తుం దన్నారు. హరితహారం కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ పార్కుల్లో ఫుడ్ కోర్ట్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ గేమ్ జోన్ ఏరియా,ర్పాటు చేస్తామని వివరించారు. కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదంగా గడపడానికి టూరిజం స్పాట్గా ఈ పార్క్‌లను తీర్చిదిద్దుతామని చెప్పారు.

# విజయమనేది ఇంటిపేరుతో రాదు

**- వ్యక్తిగత సామర్థ్యం ఉండాలి**

**- దేశంలోని 130కోట్ల మంది గళం వినిపించే అవకాశం ఏర్పడింది**

**- దేశాన్ని అవినీతి నుంచి విముక్తి కల్పిస్తాం**

**- స్వచ్ఛభారత్‌ను నిర్మిస్తాం**

**- సుపరిపాలనను ప్రజా ఉద్యమంగా మారుస్తాం**

**- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ**

న్యూఢిల్లీ, ఆగస్టు30(ఆంఎన్ఎ) : విజయమనేది ఇంటిపేరుతో రాదని, వ్యక్తిగత సామర్థ్యం కలిగి ఉండాలని, అప్పుడే విజయతీరాలకు మనం చేరుకోగలమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కోచిలో మళయాల మనోరమ మీడియా కాన్‌క్లేవ్‌ను ఉద్దేశించి శుక్రవారం ప్రధాని ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ప్రజాజీవితంలో వ్యక్తులు, సంస్థల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవాలని మోదీ అన్నారు. ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ చర్చలకు అవకాశం ఉండాలని తెలిపారు. ఐదేళ్ల క్రితం వరకు ప్రజల ఆకాంక్షలకు విలువ లేకుండా ఉండేదని కాంగ్రెస్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. విజయం అనేది ఇంటిపేరుతో రాదని.. వ్యక్తిగత సామర్థ్యం ఉండాలన్నారు. ఇప్పుడు దేశంలో వ్యక్తి ఎవరైనా సరే, ఎంతటి హోదాలో ఉన్నా సరే అవినీతికి పాల్పడం ఆమోదయోగ్యం కాదని, అది ఎప్పటికీ ఒక అవకాశం కాకూడదని అన్నారు. పోటీతత్వమే మన విధానంగా ముందుకు సాగాలని, అప్పుడే మంచి ఫలితాలను సాధించవచ్చునని మోదీ అభిప్రాయపడ్డారు. నేటి భారతంలో కొంతమంది గొంతుక మాత్రమే వినిపించడం కాదని, దేశంలోని 130కోట్ల మంది గళం వినిపించే అవకాశం ఉందని అన్నారు. మీడియాకు సంబంధించినంతవరకూ ప్రతి భారతీయుడి అభిప్రాయాలను వినడం ఎంతో ముఖ్యమని, ప్రస్తుతం దేశంలో ప్రతి ఒక్కరూ దేశానికి ఎంతో కొంత సేవ చేయాలనే అభిప్రాయ పడుతున్నారని అన్నారు. కానీ ఐదేళ్ల క్రితం ఇలా లేదు. అప్పట్లో ప్రజలు మనం ఏమైనా చేయగలమా అని అనుకునేవారని, అవినీతిని రూపుమాపగలమా అని పరస్పరం అభిప్రాయపడేవారని, కానీ నేడు.. చేయగలమా అన్న పరిస్థితి నుంచి మనం చేయగలం అనే స్థితికి చేరుకున్నామని మోదీ పేర్కొన్నారు. నువ్వు పెద్ద కుటుంబం నుంచి వచ్చావా లేదా పెద్ద నగరాలు, పెద్ద విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నావా అనే దానిపై ఆధారపడి విజయం సిద్ధించదని, వ్యక్తిగత సామర్థ్యం, సాధించాలనే సంకల్పం, కష్టపడే తత్త్వంతోనే అన్ని సాధ్యమవుతాయని ప్రధాని చెప్పుకొచ్చారు. దేశానికి అవినీతి నుంచి విముక్తి కల్పిస్తామని, స్వచ్ఛభారత్‌ను నిర్మిస్తామని ప్రధాని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

సుపరిపాలనను ప్రజా ఉద్యమంగా మారుస్తామని ప్రధాని స్పష్టం చేశారు.

# మత్స్యశాఖ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

**- బడ్జెట్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించాం**

**- తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**- ఆక్వా అక్వేరియా ఇండియా-2019 ప్రదర్శన ప్రారంభం**

**- జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించిన ఉపరాష్ట్రపతి వెంకయ్య**

హైదరాబాద్, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖ అభివృద్ధికి పెద్దపీట వేస్తుదని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆక్వా అక్వేరియా ఇండియా-2019 ప్రదర్శన ప్రారంభమైంది. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్వా అక్వేరియా ఇండియా ప్రదర్శనను ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రారంభించారు. ఈ సదస్సు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగనుంది. భారత్ సహా ఆసియా దేశాల నుంచి 200 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మత్స్య కంపెనీలు, వ్యాపార సంస్థలు, పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఏపీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..



హైదరాబాద్ హైటెక్స్‌లో అక్వేరియా ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్. చిత్రంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులకు ఎంపెడా విశేష కృషి చేస్తోందని, తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. మత్స్యశాఖ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దమొత్తంలో బ్జడెట్ కేటాయించినట్లు తెలిపారు. మత్స్యకారులకు రాయితీతో ద్విచక్ర వాహనాలు, వాహనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మత్స్యకారులకు ప్రధానమంత్రి బీమా సురక్షా యోజన, జనజీవన యోజన అమలు చేస్తున్నామని, చేప విత్తనాలు వంద శాతం రాయితీతో ఉచితంగా అందజేస్తున్నామని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రత్యేకమైన శ్రద్ధ మూలంగా నీటి సదుపాయం ఉన్న ప్రతీ చోట చేపపిల్లలను పెంచాలనే ఉద్దేశంతో ముందుకెళ్తున్నామని అన్నారు. మొదటి సారిగా రాష్ట్రంలో తొమ్మిది ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఫాం కల్చర్‌ను ప్రోత్సహించడం ద్వారా మంచి ఫలితాలు రావటం జరిగిందని అన్నారు. క్రేజ్ కల్చర్, ఫెన్ కల్చర్‌ను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి మంచి ప్రగతిలో వెళ్తున్నామని తలసాని పేర్కొన్నారు. అనంతరం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. రోజురోజుకు దేశ ప్రజల ఆహార పద్ధతులు మారుతున్నాయని, అందుకు అనుగుణంగా ఉత్పత్తులు పెరగాలని అన్నారు. చేపలు మంచి ఆరోగ్యపు పదార్థమని, చేపలు తీసుకొనేందుకు ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని అన్నారు. దీనికి అనుగుణంగా చేపల ఉత్పత్తి జరగాలని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆమేరకు చర్యలు జరుగుతుండటం మంచి పరిణామమన్నారు. మరోవైపు తినడమే కాకుండా తిన్నది అరిగి ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ వ్యాయామం కూడా చేయాలని వెంకయ్య అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇదే విషయాన్ని వెల్లడించారని, ప్రతీ ఒక్కరూ ఫిటగా ఉండేలా వ్యాయామం చేయాలని సూచించారని అన్నారు. వ్యాయామాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారని అన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యాయామం, యోగా వంటి వాటితో ఆరోగ్యవంతమైన జీవితాన్ని ప్రసాదించుకోవాలని వెంకయ్య సూచించారు. యోగా ద్వారా అనేక లాభాలున్నాయని, యోగా అనేది మోదీ కనిపెట్టింది కాదని, అది భారతదేశ సంస్కృతి అని అన్నారు. మోదీ ప్రధానిగా వచ్చిన తరువాత భారత దేశ సంస్కృతి అయిన యోగా ప్రపంచ దేశాలకు పరిచయం చేసి ప్రాధాన్యత కల్పించారని అన్నారు. ఇప్పుడు మన యోగాను ప్రపంచ దేశాలు ఆచరిస్తున్నాయని, మన దేశంలోని ప్రతీ ఒక్కరూ యోగాను రోజు దినచర్యలో భాగం చేసుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు.

## కంట్రాక్ట్ డబ్బుల కోసం కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం

**బీహార్ గోపాల్ గంజ్‌లో ఘటన**

పాట్నా,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో బీహార్‌లో ఓ ఇంజినీర్ ఇంటి ముందు కాంట్రాక్టర్ తన ఒంటికి నిప్పంటించుకున్నాడు. ఈ ఘటన గోపాల్‌గంజ్‌లో జరిగింది. భవన నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్ రామశంకర్ గోపాల్‌గంజ్‌లోని చీఫ్ ఇంజినీర్ మురళీధర్ సింగ్ ఇంటి ఎదుట నిప్పం టించుకోవడంతో తీవ్రగాయాలయ్యాయి. అతన్ని వెంటనే సిటీ ఆస్పత్రికి తరలించారు. నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం కాంట్రాక్టర్ రామశంకర్ చీఫ్ ఇంజినీర్ మురళీధర్ సింగ్ ఇంటికెళ్లారు. ఆ తర్వాత ఈ ఘటన జరిగిందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.

## విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు: వినయ్

హైదరాబాద్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ విద్యారంగంలో సిఎం కెసిఆర్ విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నారని ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యారంగంపై సిఎం కెసిఆర్ ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ప్రస్తుతం ఆంగ్లమాధ్యమం పై అందరిలోనూ ఆసక్తి ఏర్పడిందని, అందుకే ప్రైవేట్ స్కూళ్లకు గిరాకీ పెరిగిందన్నారు. దీనిని గుర్తించే సిఎం పేదలకు ఉచితంగా కెజి టూ పిజి అమలు చేయాలన్న సంకల్పంతో ఉన్నారని అన్నారు. ప్రజాభీష్టానికి అనుగుణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బోధనలో డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులను ఆకట్టుకునేలా అభ్యసన సాగుతుందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని, ఇందులో భాగంగానే గురుకుల పాఠశాలలను ప్రారంభిస్తోందని వివరించారు. ఒక్కో విద్యార్థిపై రూ. 1.25 లక్షలు ఖర్చుచేస్తూ వారి ఉన్నతికి మార్గం రూపొందిస్తోందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడానికి ప్రణాళికలు సిద్ధంచేశారన్నారు. సేవా నిబంధనల ఏర్పాటుకు మార్గం సుగమమైందని, నిబంధనల రూపకల్పనకు చర్యలు ప్రారంభించామని చెప్పారు.

**తనను ఓడించేందుకు..**

# ప్రత్యర్థులకు డబ్బులు పంపించారు

**- తనకిప్పుడు కొత్తగా వచ్చిన ఆస్తులేవీ లేవు**

**- చాలాకాలం నుంచే తాను వ్యాపారంలో ఉన్నాను**

**- మీడియా చిట్‌చాట్‌లో మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసిన ఈటెల**

హైదరాబాద్, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : తనను ఓడించేందుకు ప్రత్యర్థులకు డబ్బులు పంపించారని మంత్రి ఈటల రాజేందర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఈటల మీడియాతో చిట్ చాట్ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. తనను ఓడించేందుకు ప్రత్యర్థులకు డబ్బులు పంపించారని ఈటల రాజేందర్ అన్నారు. అయితే డబ్బులు ఎవరు ఎందుకు పంపించారనేది ఇప్పటికీ అర్థం కాలేదన్నారు. తనపై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, వారి వెనుక ఎవరో పెద్ద వ్యక్తులే ఉన్నట్లు అర్థమవుతుందని అన్నారు. తనకిప్పుడు కొత్తగా వచ్చిన ఆస్తులేవీ లేవని చాలాకాలం నుంచే తాను వ్యాపారంలో ఉన్నానని ఈటెల తెలిపారు. తన ఆస్తులపై ఈసీ చేత దాడులు కూడా చేయించారని అన్నారు. తన వద్ద ఎలాంటి దాపరికాలు ఉండవని, తాను ఏపని చేసినా నిజాతీగా చేస్తానని, నిజాయితీగా సంపాదించుకుంటానని అన్నారు. తాను ఎవరి వద్దనైనా ఒక్కరూపాయి తీసుకున్న దాఖలాలు లేవని అన్నారు. పలు పత్రికల్లో వస్తున్న వార్తలపై తాను ఇప్పుడే స్పందించనని, సరియైన సమయం వచ్చినప్పుడు అన్నింటికి సమాధానం చెబుతానని అన్నారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్‌ను కలుస్తారా అని విలేఖరులు ప్రశ్నించగా. తాను కేసీఆర్‌ను కలిసే ఆలోచన ఇప్పుడు లేదని, సమయం చూసుకొని కలుస్తానంటూ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా విలేకరులు పలు ప్రశ్నలు సంధించగా.. మీడియా ప్రతినిధులు కొద్దిరోజులు తనను వదిలేయాలని ఈటల అన్నారు. ఇదిలా ఉంటే ఈటల వ్యాఖ్యలపై తెరాస శ్రేణుల్లో విస్తృత చర్చ సాగుతుంది. శుక్రవారం సాయంత్రం తనను బదనాం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ, నేను కులం పేరుతో మంత్రి పదవి సంపాదించలేదని, గులాబీ జెండాలకు ఓనర్లం మేమే అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వీటిపై మళ్లీ సాయంత్రం సమయంలో ప్రతిప్రకటన ద్వారా తన వ్యాఖ్యలను బూతద్దంలో పెట్టి చూడవద్దని, తమ నాయకుడు కేసీఆర్ అని ఈటెల ప్రకటన చేశారు. దీంతో ఈ వివాదం సర్దుమణిగిందని అందరూ భావించిన సమయంలో శనివారం మళ్లీ ఈటల విలేకరుల చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ వివాదం ఎటు దారితీస్తుందోనని టీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

## చరిత్రలో నేటినిజం



కం॥ ఊరించెడి, రేగించెడి,
సారించెడి పాటలనిడు సంస్కృతి జేతన్
"భాగవతుల" వంశమ్మున
నాగరి రసవాహినియగు "ఆరుద్ర" సుధీన్

( ఆగష్టు 31 కవి ఆరుద్ర జననం)



-రాధశ్రీ

సెల్: 9494481210

# వ్యక్తిలో వ్యక్తిత్వం ఉండితీరాలి..

నేటినిజం
శనివారం 31-8-2019

డబ్బుంటే చాలు లేనిదేమిలేదన్న ఆలోచనే నేడు ఇంత అలజడికి, ఇంత ఆవేదనకు కారణమవుతోంది. సంపాదనకు అధర్మమార్గం తొక్కడమూ సాధారణమయినది. ద్రవ్యం ధర్మార్జితం కావాలన్నారు పెద్దలు. అధర్మమార్గాల్లో సంపాదించి విశేషంగా దానాలు చేస్తున్న ఎందరినో లోకం కొనియాడుతుంటుంది. వారు ఏ రకంగా ఆర్జించారన్నది పట్టించుకోదు. దానం చేసే ధనం న్యాయ మార్గంలో సంపాదించినదై వుండాలి. అర్థ పురుషార్థాల్లో ఉత్తమమైనది పంచతంత్ర వాక్యం. ధర్మమార్గంలో కలిగిన అర్థమే పురుషార్థంగా గ్రహించదగినది. ఒక్కో నీటిబొట్టు పడుతుంటే క్రమంగా కుండ నిండిపోతుంది. అలాగే ధనం కూడా క్షణం క్షణం సాధించుకోవాలి. అంతే కానీ ఒకేసారిగా కుండను నింపినట్లు ధనం ఒకేసారిగా నింపుకోవాలని అనుకోకూడదు. దేనికైనా ఒక క్రమపద్ధతి, ఒక క్రమశిక్షణ కలిగి ఉండాలి అనేది పెద్దల ఉవాచ. మన పురాణాలలో అంటూనే వుంటారు. దానానికి మించిన సంపద లేదని.. దానం చేసినవారందరూ పుణ్యం సంపాదిస్తారని. కానీ ఇందుకో ఒక ప్రత్యేకత ఉంది అదేంటంటే ఒకనాడు ఒక పేదవాడు యాచక వృత్తిలో ఉంటూ ఒక ఇంటికి వెళ్లాడట. ఆమె ఎంతగానో సంతోషంతో కడుపునిండా అన్నంపెట్టి అదికూడా వెండికంచంలో వడ్డించి పంపించింది. ఎంతో తృప్తిగా తిన్న యాచకుడు అమ్మా! నీవు నాకు ఎంతో సంతోషముగా నన్ను లోనికి పిలిచావు. కడుపునిండా ఒక తల్లిలా అన్నం వడ్డించేవు. కానీ నీ ముఖంలో ఎందుకో ఏదో తెలియని ఆవేదన కనిపిస్తోంది. నీకు అభ్యంతరం లేకుంటే నాకు విన్నవించగోరతాను. నేను విని నీకు అందించేది ఏమీ లేదు. చెప్పుకుంటే నీ గుండెలోని బరువు దిగుతుంది. అలాగే నేనూ నీకో సలహాలాంటిది అందించి తృప్తిగా వెళ్తాను. ఎందుకంటే నాకడుపు నింపిన తల్లివి. నీవు దుఃఖంలో ఉండగా నేనెలా చూడగలను. అనగానే.. అతనిపై నమ్మకం కలిగి.. అన్నా.. నీవు ఎవరివో నాకు తెలియదు. కానీ నేను మాత్రం ఒక దొంగకు భార్యను. నా భర్తకు ఎన్నివిధాల చెప్పినా దొంగతనం మానడంలేదు. ఇంటినిండా వెండి, బంగారం కానీ అవన్నీ నావికావు. ఎవరివో తెలియదు. ఏ కన్నీటి వారికొకు కారణం అయ్యాయో కదా అని ఆవేదనగా ఉంది. అలగని వాటిపై నాకు మోజులేదు. అందుకే మీలాంటివారికి అన్నదానం చేస్తుంటాను. ఎందుకంటే చేసిన పాపం కాస్తయినా కరుగుతుందని. అని వాపోయింది.

అంతావిన్న యాచకుడు అమ్మా! దోచుకుని వచ్చిన డబ్బుతో నీవు ఎన్ని దానధర్మాలు చేసినా ప్రయోజనంలేదు. ఉండదు. పాప పరిహారం కావు కూడా. అంటాడు. దాంతో మరింత ఆవేదన కలిగిన ముఖంతో ఉన్న ఇల్లాలిని చూసి కొన్ని విషయాలు చెబుతాడు. సంపాదించేటపుడు మేరు పర్వతమంత సంపాదించాలి. దానం చేసేటపుడు డబ్బును గడ్డిపరకలా చూడాలి. అని పెద్దలుచెబుతారు. ధనానికి దానం, భోగం, నాశనం అనే మూడు గుణాలున్నాయి. తాను అనుభవించకుండా, ఒకరికి పెట్టక పోగుపెట్టే ధనానికి నాశనం తప్పదు. అంటే సంపాదించేవారిలో దానగుణంలేకుంటే అగ్నిపాలో, లేక రాజులపాలో, దొంగల పాలో అవుతుందని తెలిపి తన దారిని తను వెళ్లిపోయారు. ధనం అనేది లేకుంటే పోయేదంటూ ఏమీ ఉండదు. మన వెంట స్వచ్ఛత మాత్రమే వస్తుంది. కానీ, ధనం ఉన్నంత మాత్రాన మనం అన్నీ సాధించగలమని అనుకోవడం ఒట్టి భ్రమ మాత్రమే! నేడు జరుగుతున్న దారుణాలు, దోపిడీలు, అఘాయిత్యాలు, కానిమాటలు ఇలా ప్రతి ఒక్కచర్య అన్నీ ధనం కోసమే! కానీ ధనం మాత్రం అందరిని వరించదు. భక్తి తత్వం ఉండి, అత్యాశ లేకుంటే చాలు సృష్టిలో తనంతట తానే నడుచుకుంటే వస్తాను అంటుంది ధనం.. కనుక మనిషికి కేవలం ధనం ఉంటే సరిపోదు. మానవత్వం ఉండాలి.. వ్యక్తిలో వ్యక్తిత్వం ఉండితీరాలి..!!

## గణేశ్ మండపాలకు అనుమతులు తప్పనిసరి: ఎస్పీ

నిజామాబాద్,ఆగస్ట్ 30(ఆర్ఎన్ఎ): జిల్లాలో వినయాకమండపాలకు అనుమతులు తప్పనిసరని ఎస్పీ అన్నారు. అనుమతి లేకుండా మండపాలను ఏర్పాటుచేస్తే తొలగిస్తామని అన్నారు. వినాయక శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల్లో నిక్షిప్తం చేస్తున్నట్లు వెల్లడించారు. మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేయొద్దని స్పష్టం చేశారు. గ్రామాలు, మండలాల్లో ఏరోజు నిమజ్జనం చేస్తారో స్థానిక పోలీసులకు తెలియజేయాలని నిర్వాకులను కోరారు. ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. అధికారులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. కలెక్టర్ సమక్షంలో జరిగిన సమీక్ష మేరకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ ముఖ్యమన్నారు. ఇదిలావుంటే వినాయక చవితి ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పండగలను అందరూ సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. వచ్చేనెల 2న వినాయకచవితి, తరవాత నిమజ్జనం ఉంటుందని తెలిపారు. మండపాల ఏర్పాటుపై సంబంధిత ఠాణాల్లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అనధికారికంగా విద్యుత్తు కనెక్షన్లు తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. శోభాయాత్ర జరిగే మార్గంలో రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. నిమజ్జనం రోజున మద్య నిషేధం అమలు చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా, గ్రామాల వారీగా శాంతికమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆర్డీవోలకు సూచించారు.

## డిపిఆర్‌లను బయటపెట్టాలి: బిజెపి

ఆదిలాబాద్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలతో రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా జిల్లాకు ఒరిగేది ఏమీ లేదని జిల్లా బాజెపి అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. పైగా కేసీఆర్ అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తెలంగాణాలో చేపడుతున్న ప్రాజెక్టులపై డీపీఆర్‌ను విడుదల చేయాలని డిమాండు చేశారు.

ఏ రకంగా లాభమో చెప్పడం లేదని, ఒప్పందాలను తెలియకుండా జాగ్రత్త పడుతున్నారని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంపై మహారాష్ట్రతో మహాఒప్పందం పేరిట ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. రైతులకు నష్టం చేకూర్చేలా ఒప్పందం కుదుర్చుకుని తామేదో సాధించామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం వద్ద 152 మీటర్లకు తగ్గకుండా ఒప్పందం కుదుర్చుకోవాల్సి ప్రభుత్వం మహారాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గం ముంపునకు గురికాకుండా 148 మీటర్లు తగ్గించుకుని ఒప్పందం కుదుర్చుకున్నారని, దీనివల్ల జిల్లా రైతులకు సాగునీటి విషయంలో తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ తన మాటల గారడితో తెలంగాణ ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. విచ్చలవిడి ప్రకటనలతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, ఆరోపించారు. అధికారంలోకి వస్తే మూతపడ్డ పరిశ్రమలను తెరిపిస్తాని చెప్పారని అన్నారు. తెలంగాణకు పునర్ వైభవం తెస్తామని ప్రకటించిన కేసీఆర్ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

## మట్టి వినాయకులనే పూజిద్దాం

వరంగల్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): విద్యార్థులు పెద్దలను చైతన్యం చేస్తూ మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి సమాజానికి దిక్సూచిలా నిలవాలని జిల్లా అధికారులు, కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ సూచిచారు. పర్యావరణ సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించడంతో పాటు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలన్నారు. కాలుష్యం పెరగడం వల్ల పంచేంద్రియాల్లో నేల, నీరు, గాలి, కలుషితమై జీవజాతి ఎన్నో సమస్యలు ఎదుర్కొంటుందన్నారు. కాలుష్యానికి హానికలిగించే వివిధ రసాయనాలను ఉపయోగించి తయారు చేసే వినాయక విగ్రహాల ద్వారా కొంత ఇబ్బందులు ఉంటాయని తెలిపారు. చిన్నారులు తయారు చేసే మట్టి వినాయకులతో మరింత ఉత్సాహంగా వినాయక చవితి వేడుకులను నిర్వహించుకోవాలని సూచించారు. మట్టి విగ్రహాలను వాడుదాం.. ప్రకృతిని కాపాడుదాం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు.

# రాజధాని చుట్టూ రాజకీయ అనకొండలు

హైదరాబాద్, ఆగష్టు 30:రాజధాని అమరావతి విషయంలో గందరగోళం తొలగడం లేదు. బొత్స సృష్టించిన అమోయమయ సునామిలో పడి ఇప్పుడు రాజకీయ నేతలు విమర్శలు ప్రతివిమర్శలు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వ పరంగా ఎలాంటి స్పష్టతా రాలేదు. అమరావతి అక్కడే ఉంటుందా లేకపోతే తరలిస్తున్నారా? మరోచోట దీని నిర్మాణం చేస్తారా అన్నది వైఎస్ జగన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి సంకేతాలు రావడం లేదు. తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్నరీతిలో బొత్స గారు వదిలిన బాణం ఇప్పుడు చిచ్చు రేపుతోంది. ఎవరికి వారు ఊహాగానాలు చేస్తున్నారు. దీంతో ఏవ జరుగుతుందో అన్న అనుమానాలు పెనుభూతమై తిరుగు తోంది. బిజెపి,టిడిపి, కాంగ్రెస్, కమ్యూనిస్టులు అంతా కూడా అమరావతి తరలిపోతోందన్న సంకేతాలు ఉన్నాయని అంటున్నారు. అమరావతి ముంపు ప్రాంతం కనుక, ఇక్కడ పెద్దగా కట్టడాలు ఏమీ లేవు కనుక, టిడిపి పార్టీ వారి భూములే ఉన్నాయి కనుక అంటూ..దీరాలు తీస్తూ సమస్యను రాజేస్తున్నారు. అయితే దీనిపై ఇంతగా గందగోళం చెలరేగడానికి కారణం నూటికి నూరుపాళ్లు ప్రభుత్వానిదే తప్పు. అయోమయ పరిస్థితిని సృష్టించి రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాడడం సరికాదు. మంత్రులు, అధికార పార్టీ నాయకులు చేస్తున్న ప్రకటనలతో రాష్ట్ర ప్రజల్లోనూ, భూములిచ్చిన రైతుల్లోనూ తీవ్ర గందరగోళం నెలకొంది. రాజధాని ఏకంగా అమరావతి నుండి మారిపోతుందని ప్రచారం చేస్తూ దొనకొండలోనే కొత్త అమరావతి అంటూ ప్రచారంచేస్తున్నారు. ఇదే అదనుగా దొనకొండలాంటి ప్రాంతాల్లో కొందరు పెద్దలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూముల వేటలో పడ్డారు. తిరుపతి గురించి ఆలోచించాలని ఇంకొందరంటున్నారు. విశ్వాఖను ఆర్థిక రాజధాని చేయాలని మరికొందరు అంటున్నారు. రాజధానిని నాలుగుచోట్ల చేయాలని మరికొందరు తెరపైకి వచ్చారు. మొత్తంగా గందరగోళానికే ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

ఐదువేల ఎకరాల్లో రాజధాని నిర్మించవచ్చని 2015 మార్చిలో అమరావతి పర్యటనకు వచ్చిన సమయంలో అప్పటి ప్రతిపక్షనేతగా జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. రాజధానిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిందని, టిడిపిలో ఉన్న పెద్దలకు లబ్ది కలిగించే విధంగా వ్యవహరించారని, దీనిపై విచారణ జరపాలని ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ప్రకటించిన విషయం విదితమే. ఇప్పటి వరకూ రాజధాని అమరావతిలో సుమారు 23 వేల కోట్ల రూపాయల విలువ చేసే పనులు వివిధ దశల్లో వున్నాయి. అమరావతి పరిధిలో టిడిపి నేతలు, ఆ పార్టీ అనుయాయులు కొందరు అప్పట్లో వందల ఎకరాల భూములు కొనుగోలు చేశారన్న ఆరోపణలు కూడా అధికార పార్టీవారు చేస్తూనే ఉన్నారు. పరిపాలనా కేంద్రమైన రాజధాని విషయంలో అస్పష్టత ఎప్పటికీ మంచిది కాదు. దీంతో పెట్టుబడి పెట్టాలనుకున్న వారు వెనక్కి పోతారు.

ప్రస్తుతం నెలకొన్న గందరగోళానికి తెరదించుతూ ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటనే స్పష్టం చెయ్యాలి. లేకుంటే నష్టపోయేది రాషట్రమే అని గుర్తించాలి. కృష్ణానది వరదలతో రాజధాని ప్రాంతం లోకి నీరు చొరబడిందని, కొండవీటి వాగు ముంపు ఉందని, ఈ నేపథ్యంలో రాజధానిపై ఏం చేయాలనేది ప్రభుత్వంలో చర్చ జరుగుతోందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ప్రకటనతో దుమారం రేగింది. ప్రభుత్వంలో వారికి వున్న పలుకుబడితో డి పట్టా భూములు, లంకలూ చేజిక్కించుకున్నారన్న ఆరోపణలూ వచ్చాయి. అమరావతిలో వారు లబ్ది పొందారు కనుక ఇప్పటి అధికార పార్టీ నేతలకు, అనుయాయులకు మేలు చేకూర్చడానికే ఈ తాజా తతంగమని అందరూ అనుకుంటున్నారు. పనిలో పనిగా టిడిపి వెనకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులనూ దెబ్బ తీసే లక్ష్యమూ వుండొచ్చు. రాజధానిని తరలించే కుట్రలో భాగంగానే ఆ ప్రాంతంలో వరద ముప్పును పెంచేందుకు ప్రయత్నించారని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొనడంతో రాజధాని రగడ మరింత రాజకీయ రంగు పులుముకుంది.రాజధాని విషయంలో వైసిపి గతంలోనూ దొనకొండ పట్ల మొగ్గుగా వుండేది. అయితే 2014లో గద్దెనెక్కిన చంద్రబాబు ఎంపిక చేసిన అమరావతికి అంగీకరించాల్సి వచ్చింది. అమరావతిపై తాజాగా నీలినీడలు అలుము కోవడంతో దొనకొండలో సందడి మొదలైంది. కొందరు అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వారి అనుయాయులు ఆయా గ్రామాల్లోని పెద్దలకు ఫోన్లు చేసి రైతులతో మంతనాలు సాగిస్తున్నారు. గతంలో డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోనివారు ఆయా భూయజమానులతో మాట్లాడడం మొదలుపెట్టారు. ఇలాంటి వాటితో ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ బూమ్ పెరుగుతోంది. ఇప్పుడు దొనకొండ ప్రాంత ప్రజలకు రంగుల కలలు చూపిస్తున్నారు. మరోవైపు అమరావతిలో భూములు కొన్నవారికీ, అభివృద్ధి జరుగుతుందన్న ఆశతో పూలింగ్‌లో భూములు ఇచ్చిన వారికీ పీడ కలలతో నిద్ర పోలేని పరిస్థితి ఏర్పడింది. టిడిపి-వైఎస్ఆర్‌సిపి మధ్య రాజకీయ వివాదంలా రాజధాని వ్యవహారం దిగజారడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదు. పైగా రాజధాని నిర్మాణం విషయంలో చెంబుడు నీళ్లు, కాసింత మట్టి ఇచ్చి చేతులు దులుపుకొన్న కేంద్ర ప్రభుత్వం దీనిని తమకేమీ పట్టనట్టుగా చోద్యం చూస్తోంది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి అవకాశమూ ఇవ్వరాదు. రాజకీయ ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ మాయాజాలాలు కాకుండా ప్రభుత్వం వెంటనే స్పష్టతనివ్వాలి.

# కొత్త సచివాలయ నిర్మాణానికి ఓకే

### టిక్నికల్ కమిటీ, మంత్రుల కమిటీ పచ్చజెండా

### హైకోర్టు తీర్పు తరవాత ముందుకు వెళ్లే యత్నం

హైదరాబాద్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): సచివాలయం నిర్మాణం తప్పదని తేలిపోయింది. గతంలో లాగా అక్కడా ఇక్కాడ అన్న సందేహాలకు తావులేకుండా ఉన్నచోటనే కొత్తదానిని కట్టాలన్న ధృడసంకల్పంతో ప్రభుత్వం ఉంది. టెక్నికల్కమిటీ కూడా తన నివేదికను సమర్పించింది. అలాగేమంత్రివర్గ ఉపసంఘం కూడా నివేదికను సిఎం కెసిఆర్‌కు సమర్పించింది. కొత్తగా సచివాలయాన్ని నిర్మించాలన్న ఏకాభిప్రాయం వచ్చింది. హైకోర్టులో ప్రస్తుత సచివాలయం కూల్చివేతపై వాదనలు సాగాయి. దానిపై హైకోర్టు తీర్పు రావాల్సి ఉంది. ఏన్న భవనాలు కూల్చవద్దంటూ పిటిషన్లు వేశారు. ఇకపోతే బైసన్‌పోలో స్థలాన్ని రాష్ట్రానికి ఇవ్వడానికి అప్పట్లో కేంద్రం అంగీకరించిందని వార్తలు రావడంతో అక్కడ అధునాతన సచివాలయం నిర్మించేందుకు ప్రభుత్వం సన్నద్దం అయ్యింది. అది కాదని తేలడంతో ఇప్పుడు ఉన్న సచివాలయంలోనే నిర్మాణానికి ప్రభుతవ సిద్దం అవ్వడమే గాకుండా సచివాయల కార్యాలయాలను బిఆర్కె భవన్‌కు తరలించింది. నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే నమూనాను కూడా సిద్దం చేశారు. ముంబైకి చెందిన ప్రముఖ అర్కిటెక్చర్ నమూననాను సిద్దం చేశారు. దీంతో త్వరలోనే ఇక్కడ సచివాలయం అధునాతన హంగులతో నిర్మితం కానుంది. రెండేళ్లలో ఇది కార్యరూపం దాల్చేలా ప్రణాళిక సిద్దం చేశారు. హుస్సేన్ సాగర్ వద్ద ఉన్న ప్రస్తుత సచివాలయం సౌకర్యంగా లేదని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలోనే సిఎం కెసిఆర్ ప్రకటించారు. పలు స్థలాలను అన్వేషించారు. సచివాలయంతో పాటు అసెంబ్లీని కూడా నిర్మించాలని యోచించారు. ఈ మేరకుఎర్రగడ్డ ఆస్పత్రిలో ఉన్న స్థలాన్ని కూడా నిర్ణయించారు. చివరకు రక్షణశాఖ ఆధీనంలో ఉన్న బైసన్ పోలో స్థలాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా కేంద్రాన్ని ఒప్పించారు. ఈ దశలో కాంగ్రెస్, టిడిపి, వామపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకించడంతో ఇప్పుడది రాజకీయ విమర్శలకు వేదికగా మారింది. ఒక క్యాంప్ ఆఫీసు ఉండగా మరో క్యాంప్ ఆఫీస్, ఒక సెక్రటేరియట్ ఉండగా..మరో సెక్రటేరియట్ నిర్మించి ఇలా కోట్ల రూపాయల ప్రజాధనం ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్న వైనం తగదని విమర్శలకు పదను పెట్టారు. ప్రజాధనం వృధా చేయడం తగదని ఆందోళనకు దిగారు. హైకోర్టులో పిటిషన్ వేశారు. దీని నిర్మాణాన్ని అడ్డుకుంటామని చెప్పారు. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన డబ్బుకు కష్టోడియన్ గా ఉండాల్సిన సర్కార్ ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తూ ముందుకు సాగుతోందని మండిపడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇద్దరు మంత్రుల క్వార్టర్లను పడగొట్టి సీఎం నివాసం..క్యాంప్ ఆఫీస్ కట్టారు. అప్పట్లో దీనిపైనా విమర్శలు వచ్చాయి. ఆనాడు టిడిపి దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. దీనికి వైఎస్ ఆనాడు వివరణ ఇస్తూ ఇది తన సొంత నివాసంకాదని,ఏ సీఎం వచ్చినా క్యాంపు కార్యాలయం అన్నది అధికారిక నివాసంగా ఉండాలన్న యోచనతో నిర్మించామని అన్నారు. సీఎంకు అధికారిక నివాసం..క్యాంప్ ఆఫీస్ అవసరం అని చెప్పారు. అయితే కెసిఆ÷- సిఎం అయ్యాక తొలుత అందులో నివసించడానికి విముఖత వ్యక్తం చేశారు. అది అనుకూలంగా లేదని తరవాత మళ్లీ కొత్తగా ప్రగతి భవన్ నిర్మించారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కేవలం వాస్తు కారణం చెప్పి ముఖ్యమంత్రి కేసీఆర్ ఐఏఎస్‌లకు చెందిన ఆరేడు క్వార్టర్లను పడగొట్టి.. ఏకంగా లక్ష చదరపు అడుగుల్లో క్యాంప్ ఆఫీస్..నివాసం..సమావేశ మందిరాలు కట్టించారు. దీనిపై చేసిన వ్యయం ఏభై కోట్ల రూపాయలపైమాటేనని కాంగ్రెస్,టిడిపిలు ఆరోపించాయి. క్యాంప్ ఆఫీస్ ఉండగా మరోటి నిర్మించడం ద్వార ప్రజల సొమ్ము దుబారా అయ్యిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఉన్న సీఎం క్యాంప్ దేనికోసం ఉపయోగిస్తారన్నది తేలలేదు. సీఎం కెసిఆర్ మాత్రం తనకు నచ్చినట్లు కట్టుకున్నా రంటూ విమర్శలు చెలరేగుతున్నాయి. ఇప్పుడు అలాంటిదే మరో ప్రయత్నం సచివాలయం గురించి చేస్తున్నారని మండిపడుతున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున..హుస్సేన్ సాగర్ ఎదురుగా ఉన్న అద్భుత సచివాలయం ఉండగా దానిని కూలగొట్టాలన్న నిర్ణయాన్ని ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు. ప్రజల సొమ్మును జవాబుదారీతో ఖర్చుపెట్టాల్సిన ముఖ్యమంత్రులే ఇలా చేయవచ్చా?.. అని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత సచివాలయానికి భయంకరమైన వాస్తుదోషం ఉందని తొలుత ప్రచారం చేసిన సీఎ కెసిఆర్ దానిని న్మించేందుకు మరో అంశమైన ఫైర్ సేఫ్టీ అంశాన్ని తెరపైకి తెచ్చారు. అందుకే ప్రస్తుత సచివాలయం యధాతథంగా పనికిరాదన్నది టెక్నికల్ కమిటీ కూడా తేల్చింది. దీంతో హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందన్నది చూడాలి.

## ఆక్వా అక్వేరియా ఇండియా 2019 ను ప్రారంభించనున్న ఉప రాష్ట్రపతి

హైదరాబాద్, ఆగస్టు 30:ఉప రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు శుక్రవారం నాడు ఆక్వా అక్వేరియా 2019ను ప్రారంభిస్తారు. మూడు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనను సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎంపిఇడిఎ) నిర్వహిస్తోంది. సముద్ర తీరం లేని రాష్ట్రాలలో సముద్రపు ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపిఇడిఎ చైర్మన్, శ్రీ కె.ఎస్. శ్రీనివాస్ పత్రికా సమావేశంలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో ఎంపిఇడిఎ హేచరీస్, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదిరిందని, ఆయన తెలిపారు. హైదరాబాద్ విమానాశ్రయంలో ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తామని, ఆయన అన్నారు. ప్రస్తుతం 'ఆర్టీమియా' అనే చేపల ఆహారాన్ని, మన దేశం దిగుమతి చేసుకుంటోందనీ, దీనిని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వాకల్చర్, అభివృద్ధి చేసిందని ఆయన తెలిపారు.

మన దేశం ఆక్వాకల్చర్ ఎగుమతుల్లో రెండవ స్థానంలో ఉంది. మన దేశం నుంచి అమెరికా, ఐరోపా, చైనా, జపాన్ దేశాలకు సముద్ర ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తున్నాము. 2018-19లో ఏడు బిలియన్ డాలర్ల విలువ గల ఉత్పత్తులను మన దేశం ఎగుమతి చేసింది.

తెలంగాణ మత్స్య శాఖ కమిషనర్ డా. సువర్ణ మాట్లాడుతూ, దాదాపు వెయ్యి హెక్టార్లలో చేపల పెంపకాన్ని చేపడుతున్నామనీ, రిజర్వాయర్లలో, చెరువులలో చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆవిడ అన్నారు.

ఈ ప్రదర్శనకు వివిధ దేశాల నుంచి 5000 మంది ప్రతినిధులు హాజరవుతారు. 200 స్టాళ్ళలో ఆక్వాకల్చర్ కు సంబంధించిన సాంకేతికత, ఇతర సంబంధిత అంశాలు ఉంటాయి.

చేపలు, రొయ్యలతో చేసిన వివిధ రకాల వంటకాలు కూడా 'సీ ఫుడ్ ఫెస్టివల్' పేరిట ఏర్పాటు చేస్తున్నారు.

## ఎన్ఎస్ టిఐ లో కొత్త తరం అడ్వాన్స్ డ్ కోర్సులు

### తక్షణ ప్రవేశాలకు ఆఖరు తేదీ సెప్టెంబరు 6

హైదరాబాద్, ఆగస్టు 29:కొత్త తరం అడ్వాన్స్ డ్ కోర్సుల లో వెనువెంటనే ప్రవేశాలకు అవకాశాన్ని కల్పిస్తున్నట్లు హైదరాబాద్ లోని రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఆంత్రప్రన్యోర్‌షిప్ (ఆర్ డిఎస్ డిఇ) ప్రాంతీయ డైరెక్టరు తెలిపారు. ఈ కోర్సు లను హైదరాబాద్ లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎస్ టిఐ) యొక్క విద్యానగర్ మరియు రామంతపూర్ శాఖల లో బోధిస్తారు. సోలార్ టెక్నీషియన్ (ఒక ఏడాది కోర్సు), జియో- ఇన్ఫర్మేటిక్స్ అసిస్టెంట్ (ఒక ఏడాది కోర్సు), మెషినిస్టు (రెండు సంవత్సరాల కోర్సు)లను ఎన్ఎస్ టిఐ విద్యానగర్ లో, డ్రోన్ పైలట్ (6 నెలల కోర్సు), టెక్నీషియన్ ఐఒటి (స్మార్ట్ హెల్త్ కేర్.. ఒక ఏడాది కోర్సు)లు ఎన్ఎస్ టిఐ రామంతపూర్ లో బోధిస్తారు. జియో- ఇన్ఫర్మేటిక్స్ అసిస్టెంట్ కోర్సు కు గణితం ఒక సబ్జెక్టు గా పన్నెండో తరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన అన్ని కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణత లేదా తత్సమాన విద్యార్హత ప్రవేశార్హత గా ఉంటుంది. స్పాట్ అడ్మిషన్ చేపట్టే తేదీ 2019 సెప్టెంబర్ 6వ తేదీ. ఆ రోజు న ఉదయం 10 గంటలకు 'ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యం ప్రాతిపదిక'న ప్రవేశాలు కల్పించనున్నారు. ఔత్సాహిక అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆ సర్టిఫికెట్ల రెండు సెట్ల జిరాక్స్ కాపీ లతో పాటు 2 పాస్‌పోర్ట్ ఫోటోల తో ఆయా ఎన్ ఎస్ టిఐ శాఖ లకు తరలివచ్చి సంప్రదించవచ్చని ఆర్ డిఎస్ డిఇ ప్రాంతీయ డైరెక్టరు స్పష్టం చేశారు.

## రైతు పక్షపాతి సిఎం కెసిఆర్: ముత్తిరెడ్డి

జనగామ,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ యాభై ఏడేండ్ల పాలనలో దారిద్ర్యాన్ని టీఆర్ఎస్ మూడేండ్లలో కడిగేసిందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రైతులకు మం చిరోజులు రాబోతున్నాయని చెప్పారు. గోదావరి, ఎస్సారెస్పీ జలాలతో గ్రామాల్లో చెరువులు నింపుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా స్వరాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి కేసీఆర్ ప్రభుత్వం రైతులను రాజులుగా చేయాలనే ఉద్ధేశంతో పనులు చేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభు త్వం సాదాబైనామా, సర్వే, పహాణీ ప్రక్షాళన చేపడుతూ, ఇకపై మండల కార్యాలయంలోనే భూ రిజిస్ట్రేషన్లు అయ్యేలా చర్యలు చేపడుతోందన్నారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని వారు విమర్శించారు. రాష్ట్రం వస్తే కరెంటు ఉండదన్న వాళ్లు నోళ్లు మూయించేలా ఇప్పుడు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతును రారాజుగా చేసేందుకే తెలంగాణ ప్రభుత్వం కంకణం కట్టుకుని పని చేస్తోందని పేర్కొన్నారు. రైతులు భరోసాగా బతికేందుకు సమితులు ఉపయోగపడతాయన్నారు. కాంగ్రెస్ నేతలు కళ్లు తెరిచి చూడాలన్నారు.

# ఏడాదిలో పాలమూరు - రంగారెడ్డిని పూర్తిచేస్తాం

- ఉమ్మడి పాలమూరుకు 15నుంచి20లక్షల ఎకరాలకు నీళ్లందిస్తాం
- గతపాలకుల అసమర్థ విధానాలతో ఇబ్బందులు పడుతున్నాం
- ఇప్పుడు వాళ్లే అవాకులు చవాకులు పేలుతున్నారు
- కృష్ణా, గోదావరి జలాలను అనుసంధానం చేస్తాం
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రక్రియను మొదలుపెట్టాయి
- రాబోయే రోజుల్లో అద్భుతాలు చూడబోతున్నాం
- చంద్రబాబు, కాంగ్రెస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు
- ఏది చేసిన అన్ని అగ్రిమెంట్ల ద్వారా ముందుకెళ్తాం
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భూములు విక్రయిస్తున్నాం
- ఆ నిధులను పాలమూరు - రంగారెడ్డికి వెచ్చిస్తాం
- పాలమూరు ప్రజలు మమ్మల్ని ఎంతో ఆదరించారు
- వారి రుణం తీర్చుకొనేందుకు సిద్ధంగా ఉన్నాం

**– తెలంగాణ సీఎం కేసీఆర్**

మహబూబ్‌నగర్,ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ): పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఏడాదిలో పూర్తిచేస్తామని, తద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాకు, రంగారెడ్డి, నల్గొండ, వికారాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని సీఎం కేసీఆర్ అన్నారు. గురువారం పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలోని రిజర్వాయర్లను సీఎం పరిశీలించారు. అనంతరం ఏదులాపురం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో సీఎం మాట్లాడారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును ఏడాదిలో పూర్తిచేయాలని నిర్ణయించామని, ఈ మేరకు అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సీఎం తెలిపారు. ఒక్కసారి ఈ ప్రాజెక్టు పూర్తయితే మంచి ఫలితాలు జిల్లాకు వస్తాయని అన్నారు. గోదావరి, కృష్ణాను లింక్ చేద్దాం, శ్రీశైలాన్ని గోదావరి జలాలతో నింపుకుందామని ఏపీ ప్రభుత్వం పెద్దలు కోరటం జరిగిందని సీఎం తెలిపారు. కృష్ణానదిలో ఈ ఏడాది నీరున్నాయని, కొన్ని సందర్భాల్లో అసలు రావటం లేదని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రెండు రాష్ట్రాలకు కలిపి ఉన్న నదులను సమగ్రంగా వాడుకుందామని ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం అడిగారని అన్నారు. సహృదయంతో రావటంతో దానికి తెలంగాణ ప్రభుత్వం ఒప్పుకోవటం జరిగిందని కేసీఆర్ తెలిపారు. ఆచర్చలు జరుగుతున్నాయని, అవి సఫలం అయితే రాబోయే రోజుల్లో అద్భుతాలు చూస్తామని కేసీఆర్ అన్నారు. శ్రీశైలం ద్వారా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా, కొంత పాక్షికంగా దక్షిణ నల్గొండ జిల్లా, అదేవిధంగా నాగార్జున సాగర్ ద్వారా నల్గొండ, ప్రస్తుత వికారాబాద్ జిల్లా, రంగారెడ్డి జిల్లాలోని భూభాగం అంతా కూడా సస్యశ్యామలం అవుతుందని సీఎం పేర్కొన్నారు. గత పాలకుల అసమర్థ విధానం వల్ల, తెలివితక్కువ ఆలోచనల వల్ల కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నామని సీఎం అన్నారు. అందులో మంచినీళ్లకు కూడా అనేక పర్యాయాలు కర్ణాటక ప్రభుత్వాన్ని బతిమాలాడాల్సి వచ్చిందని కేసీఆర్ గుర్తుచేశారు. ఆ సమస్యలను అధిగమించాలంటే గోదావరిని కృష్ణాకు అనుసంధానం చేసుకోవటం చాలా ఉత్తమం అని స్పష్టం చేశారు. దానికి ఏపీ వారు సిద్ధంగా ఉన్నారని, మనకు కూడా ఏలాంటి ఇబ్బంది లేదని, త్వరలో దానికి కార్యరూపం దాల్చుతుందని కేసీఆర్ పేర్కొన్నారు.

ఖచ్చితమైన అగ్రిమెంట్లు చేసుకుంటాం..

రెండు ప్రభుత్వాల ప్రతిపాదనలు రెండు రాష్ట్రాల్లోని కొందరు ఓర్వలేని వారు ఎద్దేవా చేస్తున్నారని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. ముఖ్యంగా ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చాలా దుర్మార్గం మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయనకు ఏం గుణం ఉందో ఇతరులకు కూడా అదే గుణం ఉంటుందని చంద్రబాబు అనుకుంటున్నారని కేసీఆర్ అన్నారు. రెండు ప్రభుత్వాల ముఖ్యమంత్రులం ఒక స్పష్టమైన అభిప్రాయానికి వచ్చామని, దీని ద్వారా చాలా సమస్యలు దూరమవుతాయని అన్నారు. గతంలో చంద్రబాబు బాబ్లీమీద పోరాటం చేశారని సాధించింది గుండసున్నా, కడవాడ ప్రాజెక్టుమీద గొడవ అక్కడ సాధించింది సున్నా.. ఎక్కడ ప్రాజెక్టు ఉన్నా కోర్టుకేయటం, అల్లరి చేయటం తప్ప చంద్రబాబు సాధించింది సున్నా అన్నారు. కానీ మేము వెళ్లి మహారాష్ట్రతో మంచి వాతావరణంలో చర్చలు జరిపి కాళేశ్వరం పూర్తిచేసుకున్నామని అన్నారు. చంద్రబాబు గానీ, ఇంకా ఎవరైనా కానీ రేపు ఆంధ్రా, తెలంగాణ రెండు రాష్ట్రాలు కృష్ణా, గోదావరి అనుసంధానం ద్వారా నీళ్లు తీసుకోవాలన్నప్పుడు, దానికి తగిన విధంగా అగ్రిమెంట్లు జరుగుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 24లక్షల పంపుసెట్లు ఉండటానికి కారకులెవరు, పాలమూరు జిల్లా వలసల జిల్లా కావటానికి కారకులు ఎవరో ఇప్పుడు వారే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పష్టంగా ఒక పాలసీ చెప్పామని, 100కు 100శాతం తెలంగాణ రైతాంగం చాలా ఇబ్బందులకు గురైంది, ఆర్థికంగా రైతన్నల పరిస్థితి క్షీణించింది పోయిందన్నారు. రైతులు బాగుపడా లంటే.. వచ్చే ఐదారేళ్లపాటు ఖచ్చితంగా ఉచితంగా కరెంట్ సరఫరా చేస్తామని చెప్పి సరఫరా చేస్తున్నాం, నీటి తీరువాను రద్దు చేశామని అన్నారు. పాలమూరు ఎత్తిపోతలకు జూరాల నీళ్లు తెవాల్సిందే అని మాట్లాడుతున్నారని.. వాళ్లు మనుషులేనా అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో కర్వెన వరకు నీటిని నింపే ఆలోచనలో ఉన్నామని, జూరాలకు కూడా పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారానే నీటిని తరలించే ఆలోచనలో ఉన్నామని కేసీఆర్ అన్నారు. దీని ద్వారా కర్ణాటక రాష్ట్రాన్ని బతిమాలుడుకొనే పరిస్థితి ఉండదన్నారు. దీని ద్వారా పాలమూరులోని ప్రతీ ఎకరాకు నీరు వస్తుందని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో 15 నుంచి 20లక్షల ఎకరాలకు నీరు ఇవ్వవచ్చునని అన్నారు. పాలమూరు ప్రజలు మమ్మల్ని గుండెల్లో పెట్టుకున్నారని, రెండింటికి రెండు పార్లమెంట్ సభ్యులు, ఐదు జడ్పీపీఠాలను గెలిపించారని, ఇంత ఏకపక్షంగా ఉన్న జిల్లాను పాలమూరు ప్రజలను మా గుండెల్లో పెట్టుకుంటామని కేసీఆర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో 15నుంచి 20లక్షల ఎకరాలకు , వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు నీరొస్తాయని అన్నారు. పాలమూరు ప్రజల రుణాన్ని తీసుకుంటానని హామీ ఇస్తున్నానని అన్నారు. హైదరాబాద్‌లోని విలువైన భూములను అమ్మకానికి పెట్టామని, ఆ డబ్బులో ఎక్కువ భాగం పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు వినియోగిస్తామని అన్నారు. అద్భుతమైన ఫలితాలు రాబోతాయని, మీరు కలలుగన్న పాలమూరు వందశాతం చూస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు.

# పెరగనున్న పత్తి దిగుబడులు

## సిసిఐ కొనుగోళ్లు పెరగాలంటున్న రైతులు

ఆదిలాబాద్,ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ): పత్తి దిగుబడులు పెరిగే అవకాశాలు ఉన్నందున ఇప్పటి నుంచే సిసిఐ రంగంలోకి దిగాలని రైతులు కోరుతున్నారు. అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. సీసీఐ ద్వారా ఎక్కువ కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు మంచి ధర లభించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులుండగా అదనంగా మరో ఆరు కేంద్రాల్లో సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరుపనున్నారు. జిన్నింగ్ మిల్లులు ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుండడంతో ఎలాంటి సమస్య లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కొనుగోలు చేసిన ప్రాంతాల్లో జిన్నింగ్ మిల్లులు ఉంటే పత్తిని మిల్లుకు తరలించి బేళ్లను తయారుచేసినా తీసుకువెళ్లేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో రైతులు ఈ యేడు అత్యధికంగా పత్తి పంట సాగుచేశారు. గతేడాది కందులు వేసి నష్టపోయిన రైతులు మళ్లీ పత్తినే ఆశ్రయించడంతో దిగుబడి అధికం కానుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో రైతులు ఈసారి గతంలో కంటే ఎక్కువగా పత్తి పంటను సాగుచేశారు. చాలామంది రైతులు పత్తికి బదులు పప్పు దినుసుల పంటలను సాగు చేయగా కంది పంట కొనుగోళ్లలో కొన్ని సమస్యలు వచ్చాయి. ఫలితంగా ఈ ఏడాది రైతులు పత్తి సాగువైపు మళ్లారు. ఫలితంగా ఈ సారి పంట దిగుబడులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు దిగుబడులు సైతం ఆశాజనకంగా ఉండడంతో కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి నిరంజన్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా పత్తి పంట ఎక్కువగా సాగైందని అంచనా. దీంతో పత్తి ధర పడిపోవడంతో రైతులకు కనీస ధర ఇప్పించేందుకు ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జిల్లాలో పత్తి కొనుగోళ్లను చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. పంట కొనుగోళ్ల సీజన్ ప్రారంభం నుంచి సీసీఐ కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంటే మద్దతుధర లభిస్తుంది. ప్రైవేటు వ్యాపారులు ఈ సారి అధిక చెల్లించే అవకాశాలున్నాయని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. జిల్లాలో పత్తి రైతులకు దళారుల బెడదను నివారించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. లైసెన్సులు కలిగిన వ్యాపారులు మార్కెట్‌యార్డుల్లోనే కొనుగోలు చేసేలా వారికి స్థలాన్ని కేటాయించ నున్నారు.

# రైతును రాజుచేయడమే సర్కార్ లక్ష్యం

## కోటి ఎకరాల మాగాణం దిశగా తెలంగాణ: నిరంజన్

మహబూబ్‌నగర్,ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ): కోటి ఎకరాలు మాగాణమే తెలంగాణ లక్ష్యంగా రాష్ట్రంలోని కోటి ఎకరాలకు రెండు పంటలకు సాగునీరందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. రైతును రాజును చేయాలని సంకల్పించిన సిఎం కెసిఆర్ ప్రణాళికబద్ధ విధానాలకు శ్రీకారం చుట్టారని అన్నారు.

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో కీలక రిజర్వాయర్ అయిన కర్వెన ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రాజెక్టు ఏరియల్ వ్యూ నిర్వహించి అనంతరం ఇంజినీర్లు అధికారులు వర్క్ ఏజెన్సీలతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కర్వెన రిజర్వాయర్ కీలకమైనదని దీనికి సంబంధించిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి కావాలని సంబంధిత ఇంజినీర్లు వర్క్, ఏజెన్సీలకు సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం నడుస్తున్న పనులను మూడు షిఫ్టులో నిరంతరాయంగా చేయాలని సూచించారు. వట్టెం రిజర్వాయర్ పరిశీలన సమయంలో పలువురు నిర్వాసితులు ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వారికి న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. కాళేశ్వరం పనులు పూర్తయ్యాయని, ఇక పాలమూరు పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇది సిఎం కెసిఆర్ దక్షతకు నిదర్శనమని అన్నారు. లక్ష్యాన్ని గుర్తించని కాంగ్రెస్ సహా విపక్షాలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంతి కేసీఆర్ రైతు పక్షపాతి అని పేర్కొన్నారు. రైతన్న సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. రైతును రాజును చేయడమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నాడన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. రైతులకు దశల వారీగా రుణమాఫీ, ఉచిత విద్యుత్, విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రెవెన్యూ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సకాలంలో అధికదిగుబడి పొందేలా సూచనలు, సలహాలు ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్ల ఖర్చుతో కాళేశ్వరం, పాలమూరు, దిండి, భక్త రామదాసు, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడం, రైతులకు యంత్రాలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పంటలు పండించేందుకు 24 గంటల నిరంతర విద్యుత్తు అందిస్తుందన్నారు.

# కోయంబత్తూరులో ఎన్‌ఐఎ విస్తృత తనిఖీలు

చెన్నై,ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ): జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్‌ఐఏ గురువారం తమిళనాడులోని కోయింబత్తూర్‌లో విస్తృత సోదాలు నిర్వహించింది. జిల్లాలోని మొత్తం ఐదు చోట్ల తనిఖీలు చేసి ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్స్, సిమ్ కార్డులు, పెన్‌డ్రైవ్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఐఏ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రసంస్థ కార్యకలాపాలు, శ్రీలంకలో ఈస్టర్ రోజు జరిగిన బాంబు దాడులపై ప్రస్తుతం ఎన్‌ఐఏ విచారణ జరుపుతోంది. కాగా ఇవాళ జరిగిన తనిఖీల్లో ఎన్‌ఐఏ అధికారులు, తమిళనాడు పోలీసులు సంయుక్తంగా పాల్గొన్నారు. తమిళనాడులో ఐఎస్‌ఐఎస్ సూత్రధారిగా భావిస్తున్న మహ్మద్ అజారుద్దీన్‌ను ఎన్‌ఐఏ అధికారులు జూన్‌లో అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోయింబత్తూర్‌లో ఏడు చోట్ల తనిఖీలు చేసిన అధికారులు.. శ్రీలంక మానవ బాంబు జహ్రాన్ హషిమ్‌కు ఫేస్‌బుక్ ఫ్రెండ్‌గా ఉన్న అజారుద్దీన్‌ను అరెస్ట్ చేశారు.

# పోరాడే ధైర్యం లేనివారే పార్టీని వీడుతున్నారు: ఎన్సీపి నేత

ముంబై,ఆగస్టు30 (ఆర్‌ఎన్‌ఎ): ఎదిరించి పోరాడే ధైర్యం, బలం లేనివారే తమ పార్టీని వీడి అధికార పక్షంలో చేరుతున్నారని మహారాష్ట్ర ఎన్సీపీ చీఫ్ జయంత్ పాటిల్ పేర్కొన్నారు. ఎన్సీపి నుంచి వెళ్లే వారిని పట్టించుకోబోమని అన్నారు. స్థానిక ఎంపీ ఉదయన్‌రాజే భోసలే ఎన్సీపీని వీడి బీజేపీలో చేరుతున్నారంటూ జరుతున్న ప్రచారం నేపథ్యంలోనే ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఒకరు వెళ్లిపోయారు. ఇప్పుడు మరొకరు కూడా అదే దారిలో ఆలోచిస్తున్నారు. పార్టీని వీడాలని యోచిస్తున్న అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానని పాటిల్ పేర్కొన్నారు. భోసలే బంధువు శివేంద్ర సిన్హ్ భోసలే ఇటీవల ఎన్సీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే.

# శ్రీనగర్ చేరుకున్న ఏచూరి..పార్టీ నేతకు పరామర్శ

శ్రీనగర్,ఆగస్టు30 (ఆంఎన్‌ఎ): సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం ఉదయం శ్రీనగర్ చేరుకున్నారు. తన పార్టీ ఎమ్మెల్యే యూసుఫ్ తరిగమిని కలుసుకోవడానికి సుప్రీంకోర్టు అనుమతిచ్చిన నేపథ్యంలో ఏచూరి శ్రీనగర్ వచ్చారు. జమ్మూ కశ్మీరులో 370వ అధికరణాన్ని కేంద్రం రద్దు చేసి భద్రతాపరమైన ఆంక్షలు విధించిన తర్వాత కశ్మీరును సందర్శించిన తొలి ప్రతిపక్ష నాయకుడు ఏచూరియే. శ్రీనగర్ విమానాశ్రయం చేరుకున్న ఏచూరి మీడియాతో మాట్లాడడానికి అవకాశమివ్వకుండా భద్రతా బలగాలు తరిగమి నివాసానికి తీసుకెళ్లిపోయాయి. సుప్రీంకోరు ఉత్తర్వుల మేరకు ఏచూరి అనారోగ్యంతో బాధపడుతున్న తన పార్టీ ఎమ్మెల్యేను పరామర్శించి వెనక్కు వెళ్లిపోవలసి ఉంటుంది. ఢిల్లీకి చేరుకున్న అనంతరం సుప్రీంకోర్టుకు ఒక నివేదికను సమర్పించవలసి ఉంటుంది.

# ఎంజీఎంలో మంత్రి ఆకస్మిక తనిఖీ

## డాక్టర్ గైర్హాజర్‌పై మంత్రి ఎర్రబెల్లి ఆగ్రహం
## -చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచన

వరంగల్,ఆగస్టు30(నేటినిజం ప్రతినిధి): ఎంజీఎం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఒపీ విభాగంలో వైద్యుల లేకపోవడంపై ఆగ్రహం. వ్యక్తం చేశారు. పలు విభాగాల్లోకి వెళ్లి హాజరు కాని వైద్యులతో ఫోన్లో మాట్లాడిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అసహనం వ్యక్తం చేశారు. ఎంజీఎంకు వచ్చిన పేషెంట్ల తో మాట్లాడిన మంత్రి.పలు విభాగాల్లో సేవల సరిగా లేపోవడంపై సూపరింటెడెంట్ పై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఐదుగురు సీనియర్ డాక్టర్లు అందుబాటులో లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. వైద్య సేవల పరంగా చాలా పొరపాట్లు ఉన్నాయి.

-డాక్టర్లకు మొదటి హెచ్చరికగా చెబుతున్నాం. మరోసారి ఇలా జరిగితే కటినంగా వ్యవహరిస్తాం. వాళ్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టరు సూచించాను. వారు దీనిపై నిర్ణయిస్తారు.

-మీ డ్యూటీ సమర్థవతంగా చేయాలని వైద్యులను కోరుతున్నాను. దాతలు, ప్రైవేటు వైద్యుల సహాయంతో ఎంజీఎంలో ఫర్నిచర్, ఇతర వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-ఎంజీఎం ను పేదల పెన్నిధిగా మార్చేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారు. ఎంజీఎం అభివృద్ధి కి అవసరమైన నిధులు ఉన్నాయన్నారు.

వర్వాత రోహకుడికి అభినందన

చైనా టిబెట్ సరిహద్దు దాక్‌లో గల 'స్టాక్ కాంగ్రీ' పర్వత శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన వరంగల్ యువకుడు రాసమల్ల అంకిత్ ను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేకంగా అభినందించారు. హన్మకొండలోని అంకిత్ ఇంటికి వెళ్లి సన్మానం చేశారు. అంకిత్ ఘనత అందరికీ ఆదర్శనీయం అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆయనకు అండగా ఉంటూ ప్రోత్సహిస్తామని అన్నారు.

# విద్యుత్ కొనుగోళ్లపై సర్కార్ బుకాయింపు

## ప్రభాకర్ రావు తప్పుడు ప్రకటనపై రేవంత్ మండిపాటు

హైదరాబాద్,ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ): విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలు లేవని టీఆర్‌ఎస్ బుకాయిస్తోందని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్ రెడ్డి విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌తో దీర్ఘకాలిక ఒప్పందం నష్టమని ఈఆర్‌సీకి ఫిర్యాదు చేశామని, అప్పటి ప్రిన్సిపాల్ సెక్రటరీ కూడా కొనుగోళ్లను తప్పుబట్టారని ఆయన చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్ కొనుగోళ్ల వెనక అదాని హస్తం ఉందని రేవంత్ ఆరోపించారు. తెర వెనక అదాని.. తెర ముందు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఉన్నాయని ఆయన సంచలన ఆరోపణ చేశారు.

తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకరరావు పచ్చి అబద్దాలు చెబుతున్నారని, ఆయనను గన్‌పార్క్ ముందు నిలబెట్టి కాల్చినా తప్పులేదని రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

విద్యుత్‌ను కేసీఆర్ ఆర్థిక వనరుగా మార్చుకున్నారని విమర్శించారు. అత్యవసర విద్యుత్ కొనుగోళ్ల పేరిట దోపిడీకి పాల్పడ్డారని, కేసీఆర్ అవినీతిపై తాము ఫిర్యాదు చేస్తామని.. విచారణ జరిపించడానికి లక్ష్మణ్, నడ్డా, కిషన్‌రెడ్డి సిద్ధమా అని రేవంత్ సవాల్ చేశారు. తన ఆరోపణలు తప్పైతే ఏ శిక్షకైనా సిద్ధమని చెప్పారు. టీఆర్‌ఎస్, బీజేపీ డ్రామాలు ఆపాలని, సీబీఐ విచారణకు బీజేపీని అడ్డుకుంటుందెవరని రేవంత్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

# శ్రీనగర్‌లో సాధారణ పరిస్థితులు

## విమాన టిక్కెట్ కౌంటర్లు ప్రారంభం

శ్రీనగర్,ఆగస్టు30 (ఆంఎన్‌ఎ): కాశ్మీర్‌లో మెల్లగా పరిస్థితులు చక్కబడుతున్నాయి. శ్రీనగర్ నుంచి విమాన ప్రయాణం సాగించే వారికి అక్కడి ప్రభుత్వం ఊరట కలిగించింది. విమాన టికెట్ బుకింగ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం చూపింది. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో జమ్మూ-కశ్మీర్‌లో ఇంటర్నెట్, సమాచార వ్యవస్థ స్తంభించింది. ఈ నేపథ్యంలో విమాన ప్రయాణికులు టికెట్ బుకింగ్ చేసుకునేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అక్కడి ప్రభుత్వం టూరిస్ట్ రిసెప్షన్ సెంటర్ వద్ద ఎయిర్ టికెట్ బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసింది.

ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం టికెట్ బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆ రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ నిస్సార్ అహ్మద్ తెలిపారు. ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు, ఎయిర్‌లైన్స్ యాజమాన్యాలను తాము కలిశామని, టికెట్ బుకింగ్ కౌంటర్లను వారే గుర్తించినట్లు తెలిపారు. ట్రావెల్, ట్రేడ్ ఏజెంట్లను కూడా కలిసి ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. టికెట్ బుకింగ్ కౌంటర్ల ఏర్పాటు చేసి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని, ఇది తమకు చాలా అనుకూలంగా ఉందని కౌంటర్ వద్ద టికెట్ పొందిన ఓ స్థానికుడు తెలిపారు. కౌంటర్ ఏర్పాటు చేయకపోతే టికెట్ కోసం ఎయిర్‌పోర్టు వరకూ వెళ్లాల్సి వచ్చేదని పేర్కొన్నారు.

# తెలంగాణలో అధికారంలోకి వస్తాం

## కేసీఆర్ నుంచి తెలంగాణను కాపాడుకోవాలి: లక్ష్మణ్

ఖమ్మం,ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ): దేశానికి నరేంద్రమోదీ నాయకత్వం అవసరం ఉంది కాబట్టే ఇతర పార్టీ నాయకులు బీజేపీలో చేరుతున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం పాలేరు బీజేపీ సభలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కల్వకుంట్ల కుటుంబ సేవలోనే నాయకులు గడుపుతున్నారని విమర్శించారు. ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ బంగారు తెలంగాణను ఎలా నిర్మిస్తారని లక్ష్మణ్ ప్రశ్నించారు. అధికారంలో ఉన్నామని విర్రవీగడం సరికాదని.. దేశంలోని 18 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందన్న విషయాన్ని కేసీఆర్ గుర్తు చేసుకోవాలన్నారు. ఎందరో అమరుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ క్రమంలో తెలంగాణలో బీజేపీ తప్పక అధికారంలోకి వస్తుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా కమల వికాసమే అంటూ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడు జరిగేందంతా సినిమా విడుదలకు ముందు ట్రైలర్ మాత్రమేనని అసలు సినిమా ముందుందని వ్యాఖ్యానించారు.

# భగ్గుమన్న బంగారం ధరలు

## 40వేల మార్కును దాటిన పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ,ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ): దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు చుక్కలను తాకుతున్నాయి. అనుకున్నట్లుగా బంగారం ధరలు 40వేల ధరను దాటపోయింది.

గత కొంతకాలంగా పెరుగుతూపోతున్న పుత్తడి ధర నేటి మార్కెట్లో ఏకంగా రూ. 40వేల మార్కును దాటి సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. గురువారం ఒక్కరోజే రూ. 250 పెరగడంతో బులియన్ మార్కెట్లో 10 గ్రాముల పసిడి రూ. 40,220 పలికింది. అటు వెండి ధర కూడా రూ. 50వేల మార్కును సమీపిస్తోంది. నేడు రూ. 200 పెరగడంతో కేజీ వెండి ధర రూ. 49,050కి చేరింది. ఆర్థిక మాంద్యం భయాలు, అమెరికా-చైనా మధ్య నెలకొన్న వాణిజ్య అనిశ్చితులు, రూపాయి క్షీణత తదితర కారణాలతో బంగారంలో పెట్టుబడులు పెట్టడవే శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నారు. దీనికితోడు పండగ సీజన్ కావడంతో నగల వ్యాపారులు, నాణెలిల తయారీదారులు, పారిశ్రామిక వర్గాల నుంచి కూడా డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ లోహాల ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

# ఎయిర్ ఇండియా ప్రైవేట్ పరం

న్యూఢిల్లీ,ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ): ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం ప్రకటించింది. ఇకపై ఎయిర్ ఇండియా నిర్వహణ ప్రభుత్వం ఆధీనంలో ఉండదని స్పష్టం చేసింది. ఎయిర్ ఇండియాను టేకోవర్ చేసేందుకు పలు కార్పొరేట్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు. అటు..దేశంలోని అన్ని ప్రధాన విమానాశ్రయాల్లో ఏడాదిలోపు, అన్ని విమానాశ్రయాల్లో రెండెళ్లలోపు బాడీ స్కానర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

## ఏపీ వార్తలు

# టిడిపి గెలుపులో హరికృష్ణది ప్రత్యేక పాత్ర

### తొలివర్ధంతి సభలో బాబు నివాళి
### ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టిడిపి నేతల శ్రద్ధాంజలి

అమరావతి,ఆగస్ట్30 (ఆర్‌ఎన్‌ఎ): తెలుగుదేశం స్థాపించినపుడు పార్టీ గెలుపుకోసం నందమూరి హరికృష్ణ రాత్రింబవళ్లు కష్టించి పనిచేశారని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. ఆయన మృతిని ఇప్పటికీ జీర్ణించుకోకపోతున్నానని చెప్పారు. ప్రథమ వర్ధంతి సందర్భంగా గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో చంద్రబాబు సహా పలువురు నేతలు హరికృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తెలుగును ఎంతో అభిమానించే హరికృష్ణ.. తెలుగు భాషా దినోత్సవం రోజే చనిపోవడం దురదృష్టకరం. ఏదైనా ఆయన ముక్కుసూటిగా చెప్పేవారు. సినిమాల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించారు. హరికృష్ణ మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరం అని చంద్రబాబు ఆయనను గుర్తు చేసుకున్నారు. ఇకపోతే ప్రముఖ సినీనటుడు, తెదేపా నేత నందమూరి హరికృష్ణ తొలి వర్ధంతి కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హరికృష్ణ చిత్రపటానికి నివాళులర్పించిన తెదేపా నేతలు.. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెదేపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. చైతన్య రథసారథిగా పార్టీకి ఎంతో సేవచేశారని కొనియాడారు. పార్టీ క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు ముందుండి పార్టీని నడిపించడంతో పాటు కార్యకర్తలకు మనోధైర్యం కల్పించేవారని రమణ గుర్తు చేసుకున్నారు. ఓ గొప్ప నటుడిగా ప్రజలను అలరించడమే కాకుండా మంత్రిగా, ఎంపీగా ప్రజలకు సేవలందించారని చెప్పారు. పేద కోసం మంచి కార్యక్రమాలు చేపట్టారని.. ఆయన చూపిన బాటలో కార్యకర్తలు నడవాలని కోరారు. ఎన్టీఆర్ తెదేపాను స్థాపించినప్పటి నుంచి హరికృష్ణ సేవలందించారని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. చివరి వరకు పార్టీలో ఉండి అందరికీ ఇష్టమైన వ్యక్తిగా ఉన్నారని చెప్పారు. రవాణా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో మహిళలకు ఆర్టీసీలో ఉద్యోగాలు కల్పించింది హరికృష్ణేనని గుర్తుచేసుకున్నారు. అన్ని విషయాల పట్ల అవగాహన ఉన్న వ్యక్తి, మంచి హాస్య చతురతుడని కొనియాడారు. హరికృష్ణ లేని లోటును ఎవరూ తీర్చలేదని రావుల అన్నారు.

# అమరావతి గందరగోళం తొలగేదెప్పుడో?

### ఆజ్యం పోస్తున్న అధికార పార్టీ నేతలు

అమరావతి,ఆగస్ట్30(ఆర్‌ఎన్‌ఎ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దేశంలో లేని సమయంలో రాజధాని వంటి కీలక అంశాన్ని మంత్రులు, ముఖ్యులూ లేవనెత్తడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది చర్చ చేయాలి. బొత్స సత్యనారాయణ ఊరికే మాటలు అని వదల్లేదు. నిరంతరాయంగా దానిపై మాట్లాడుతూనే ఉన్నారు. రాజధాని అమరావతిలో రూ. 35వేల కోట్ల పనులకు గతంలో టెండర్లను పిలిచారని, వాటిలో నిధుల సమీకరణకు బ్యాంకులతో ఒప్పందాలు చేసుకోని పనులన్నింటినీ రద్దు చేశామని మంత్రి బొత్స సత్యనారాయణ తాజాగా చేసిన ప్రకటన ఇక్కడ గమనార్హం. నిధులను సమీకరించుకోకుండా పనులు చేస్తే బిల్లులెవరు చెల్లిస్తారు? ఇప్పటికే జరిగిన పనులకు రూ. 2,800 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అమరావతిలో టెండర్లు ఖరారు చేసి ప్రారంభించని పనుల్ని రద్దు చేశామని, మిగతా పనులను ఏ విధంగా చేపట్టాలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు 64వేల స్థలాలను తిరిగిచ్చామని, వాటిలో 43వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్లే ఇంత వరకు జరిగాయని, మిగతా స్థలాల రిజిస్ట్రేషన్లను త్వరలో పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు.

అంతేగాక పోలవరం, విద్యుత్ పిపిఎలు, రాజధాని... ఇలాంటి అన్ని కీలక అంశాల పైనా ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో చర్చించాకే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందనీ ఎంపి విజయసాయి రెడ్డి ఢిల్లీలో మీడియాతో చెప్పారు. ఏ.పి ప్రభుత్వం తమకు స్నేహపూర్వకమైనదని ఆ సందర్భంలోనే రైల్వే మంత్రి పియూష్ గోయల్ చెప్పడం గమనార్హం. అయితే, రాజధాని అక్కడ ఉండాలా లేదా అనే విషయం రాష్ట్రమే తేల్చుకుంటుందని, కేంద్రం పరిధిలో లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొనడం మరో మెలిక. అంటే రాష్ట్ర ప్రజలను గందరగోళ పర్చడంలో ఎవరికి వారు తమ పాత్ర పోషిస్తున్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇకపోతే రాజధానిపై గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఇందులో కూడా అమరావతిపై స్పష్టత ఇవ్వలేదు. రాజధాని రైతులకు కౌలు చెల్లింపు ప్రక్రియ ఒకటి రెండు రోజుల్లో మొదలవుతుందని సీఎంకు వివరించినట్లు చెప్పారు. కృష్ణా నదికి వరదలొస్తే అమరావతి ముంపునకు గురవుతుందని, రాజధానిపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మీరు అన్నారు కదా? అదేమైనా చర్చకు వచ్చిందా? అన్న ప్రశ్నకు... పరిశీలిస్తున్నామనే చెప్పానని, ఇప్పటికీ అదే విషయం చెబుతున్నానని బొత్స స్పష్టం చేశారు. సీఎంతో సమావేశంలో ఆ అంశమేదీ చర్చకు రాలేదని తెలిపారు. రాజధానిపై ఎవరెవరో చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పలేనని, వారినే అడగాలని సూచించారు. ఇకపోతే అమరావతిలో చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టు హ్యాపీనెస్ట్‌లో ప్లాట్లు బుక్ చేసుకున్నవారు అడ్వాన్స్ రూపంలో చెల్లించిన రూ. 80 కోట్లు సీఆర్‌డీఏవద్ద ఉన్నాయని బొత్స తెలిపారు. ఈ ప్రాజెక్టులో అధిక మొత్తానికి టెండర్లను ఖరారు చేశారన్నది తమ అభిప్రాయమని చెప్పారు. అందుకే రివర్స్ టెండరింగ్‌కు వెళ్లే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. రాజధానిని అమరావతిలో కొనసాగించే ఉద్దేశం వైకాపా ప్రభుత్వానికి లేదంటూ భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు చేసిన వ్యాఖ్యల గురించి ప్రస్తావించగా... ఆయన ఏ ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేశారో తనకు తెలియదన్నారు. మొత్తంగా ఇప్పుడు దీనిపై స్పష్టత ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా లేదన్నది సుస్పష్టం. గందరగోళానికి ఎప్పుడు ఎలా తెరపడుతుందన్నది చూడాలి.

# ఏపీలో సానియా మీర్జాకు అవమానం!

**– సానియా ఫొటో పెట్టి పీటి ఉషాఅని రాసిన అధికారులు**

**– వైరల్‌గా మారిన వీడియో**

విశాఖపట్టణం, ఆగస్టు30 (ఆర్‌ఎన్‌ఎ) : అధికారులు ప్రభుత్వ పరువు తీస్తున్నారు. నేతల ప్రాపకం కోసం అధికారులు ఎలా పడితే అలా ప్లెక్సీలు పెడుతున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏపీలో ఓ చోట ఏర్పాటు చేసిన ప్లెక్సీ అందరినీ ఆశ్చర్యం కలిగిస్తోంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వైఎస్సార్ క్రీడా ప్రోత్సహకాలు అంటూ ఓ ప్లెక్సీ వెలిసింది. అందులో సానియా మీర్జా పెద్ద ఫొటో ఉంది. అంతవరకు బాగానే ఉంది. దానికింద మాత్రం పీటీ ఉష అని రాసుంది. దాన్ని చూసి అందరూ అవాక్కు అవుతున్నారు. అధికారులకు క్రీడలపై ఎంత పరిజ్ఞానం ఉందో దీనిని బట్టి తెలుసుందని చర్చించుకుంటున్నారు. అంతమాత్రమే కాదు.. ఆమెకు పద్మభూషణ్, పద్మశ్రీ, అర్జున్ అవార్డులు కూడా ఇచ్చేశారు. ఈ ప్లెక్సీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అధికారుల తీరుపై క్రీడాభిమానులు మండి పడుతున్నారు. ప్రభుత్వం తీరు ఇలానేనా ఉండేది అని ప్రశ్నిస్తున్నారు.

### ఏపీ క్రీడాశాఖ మంత్రి పరిజ్ఞానమిది – నారా లోకేశ్

సానియామీర్జా ఫొటో కింది పీటీ ఉషా అని పేరు రాయడంపై టీడీపీ నేత నారా లోకేశ్ విమర్శలు గుప్పిస్తూ వరుస ట్వీట్లు చేశారు. వైసీపీ ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం ఇచ్చే సంగతి అటుంచి, స్వాతిముత్యాల్లాంటి వారి పార్టీ నేతల క్రీడా పరిజ్ఞానంతో క్రీడాకారులను అవమానించకపోతే చాలు అన్నట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. సానియా మీర్జా ఎవరో, పీటీ ఉష ఎవరో తెలియని దుస్థితిలో ఏపీ క్రీడాశాఖ మంత్రి ఉన్నారని విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం చంద్రబాబు గురించి లోకేశ్ ప్రస్తావించారు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో క్రీడాకారులు గోపీచంద్ కు ఐదు ఎకరాల స్థలం ఇచ్చి బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు సహకరించారని, ఇప్పుడు ఆ అకాడమీ పీవీ సింధులాంటి క్రీడా ఆణిముత్యాలను దేశానికి అందిస్తోందని, అది చంద్రబాబు దార్శనికత అని లోకేశ్ కొనియాడారు.

# అన్నమయ్య సంకీర్తనలను వ్యాప్తి చేయాలి

### సంకీర్తనల వ్యాప్తికి గ్రామాలు, పాఠశాలల్లో కార్యక్రమాలు : టిటిడి ఈవో




టిటిడి అంతర్గత ఆడిట్‌పై అధికారులతో గురువారం అన్నమయ్య భవన్‌లో సమావేశం అయిన ఇవో అశోక్ కుమార్ సింఘాల్

తిరుమల,ఆగస్ట్30(ఆర్‌ఎన్‌ఎ): సనాతన హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను ప్రజలందరికీ చేరువ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని టిటిడి ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో గల సమావేశ మందిరంలో గురువారం ఉదయం అంతర్గత ఆడిట్‌పై సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ద్వారా అన్నమయ్య సంకీర్తనలు వ్యాప్తి చేసేందుకు అన్ని జిల్లాలల్లోని గ్రామాలు, పాఠశాలల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు శ్రీ విశ్వనాథంను ఆదేశించారు. కార్యక్రమాల అనంతరం ధర్మప్రచారానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంత వరకు ఉపయోగ పడుతుందనే విషయమై భక్తుల నుండి అభిప్రాయ సేకరణ నిర్వహించాలని సూచించారు. ఆళ్వారు దివ్య ప్రభంధ ప్రాజెక్టు ద్వారా తమిళం,సంస్కృతం కలిసిన మని ప్రవలం భాష తెలిసినవారు దేశంలో చాల అరుదుగా ఉన్నారన్నారు. ఆ భాషకు సంబంధించిన గ్రంథాలను ఇతర భాషలలోనికి అనువదించడానికి నిష్ణాతులైన పండితుల సేవలు వినియోగించుకోవాలని ఆళ్వారు దివ్య ప్రభంధ ప్రాజెక్టు ప్రత్యేకాధికారిని ఆదేశించారు. అదేవిధంగా టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు సంవత్సరం మొత్తం నిర్వహించే కార్యక్రమాలతో వార్షిక క్యాలెండర్ రూపొందించాలని దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారిని ఆదేశించారు. టిటిడి ప్రాజెక్టులపై త్వరలో సమీక్ష నిర్వహించాలని తిరుపతి జెఈవో పి.బసంత్‌కుమార్‌కు సూచించారు. అత్యాధునిక వసతులతో టిటిడి కల్యాణ మండపాల స్థాయిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా భక్తులను ఆకట్టుకునేలా మరింత ఆకర్షణీయంగా పెయింటింగ్, అగ్ని ప్రమాద నివారణ పరికరాలు, ఇతర సివిల్, ఎలక్ట్రికల్ పనులు చేయాలన్నారు. తద్వార ఎక్కువ మంది భక్తులకు టిటిడి కల్యాణ మండపాలు ఉపయోగించుకుంటరని తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయం చెంత ఉన్న ఉగ్రాణంలో ప్రసాదాల తయారీకి ఉపయోగించే వంట సరుకులు నిల్వచేసేందుకు అవసరమైన అల్మారాలను ప్రత్యేకంగా తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కల్యాణకట్టలో భక్తులు సమర్పించే తలనీలలో పొడవాటి తలనీలాను ఆరపెట్టేందుకు నూతన పద్దతులను అవలంభించాలన్నారు. తిరుమలలోని నీటి ప్రాజెక్టుల నుండి ఉపయోగించే నీరు వృధా కాకుండా నిరంతర పర్యవేక్షణతో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల ప్రత్యేకాధికారి ఎ.వి.ధర్మారెడ్డి, తిరుపతి జెఈవో పి.బసంత్‌కుమార్, సివిఎస్వో గోపినాథ్‌జెట్టి, సిఇ రామచంద్రరెడ్డి, ఎఫ్ఎ అండ్ సిఏవో బాలాజి, సిఏవో శేషశైలేంద్ర, ప్రముఖ అడిట్ సలహాదారులు నరసింహమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కుదేలవుతున్న నిర్మాణరంగం

### ఇసుక కొరతతో కార్మికులకు పనులు కరవు

అమరావతి,ఆగస్ట్30 (ఆర్‌ఎన్‌ఎ): ఇసుక కొరతతో ఇప్పుడు నిర్మాణ రంగ కార్మికులు ఆందోళనకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే నిర్మాణ రంగ మెటీరియల్‌పై జిఎస్టీ వల్ల భారం పెరిగిందని, ప్రభుత్వం ఆ భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాజాగా ఇప్పుడు ఇసుక కొరత కారణంగా ప్రజలకు తీరని నష్టం జరుగుతోంది. నిర్మాణ కార్మికులు కూడా పనులు దొరకడం లేదని అంటున్నారు.

దేశవ్యాప్తంగా దాదాపు ఆరుకోట్ల మంది నిర్మాణరంగ కార్మికులుంటే వారిలో రెండు కోట్ల మంది మాత్రమే కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదయ్యారని బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ నేతలు తెలిపారు. కేవలం మూడింట ఒక వంతు మంది కార్మికులే ఈ బోర్డులో రిజిస్టర్ అయ్యారని, మిగిలిన వారినీ నమోదు చేయించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఆ రంగంలోని కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులను వెచ్చించడంలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో సెస్ వసూలు చేయడంలేదని, వసూలుచేసిన దాంట్లోనూ పూర్తిగా నిర్మాణరంగ కార్మికుల సంక్షేమానికి వెచ్చించడంలేదని విమర్శించారు. ప్రభుత్వం సెస్ ద్వారా విస్తృత స్థాయిలో సెస్ వసూలు చేయాలని, ఆ మొత్తాన్ని నిర్మాణరంగ కార్మికుల పిల్లల విద్య, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్యం తదితర సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రీన్ బెల్ట్ పేరుతో సుప్రీం కోర్టు తీర్పును అడ్డు పెట్టుకుని ప్రభుత్వం మైనింగ్‌ను పూర్తిగా నిలిపివేసిందన్నారు. ఇందువల్ల నిర్మాణరంగం సహా, రియల్ ఎస్టేట్ రంగం కూడా దెబ్బతింటోందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం మైనింగ్‌కు అనుమతులు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు పేరును రాష్ట్ర ప్రభుత్వాల నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వారి పేర్లను పెట్టుకోవడాన్ని ఖండించారు. సంక్షేమ బోర్డు నిధులను పక్కకు మళ్ళిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు తమ హక్కులను కోల్పోయేలా చట్టాల్లో తీసుకొస్తున్న మార్పులను వ్యతిరేకించాలని సూచించారు. ఇసుక కొరత లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఫ్లడ్ మేనేజ్‌మెంట్ తెలియని నేతలు: సుజనా

గుంటూరు,ఆగస్ట్30 (ఆర్‌ఎన్‌ఎ): రాజధాని ప్రాంతంలో వరద ముంపు ప్రకృతి విపత్తు కాదని ఎంపీ సుజనా చౌదరి అన్నారు.

వరద ముంపు గ్రామాలు భట్టిప్రోలు, కొల్లూరు మండలాలతో పాటు లంక గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ ఫ్లడ్ మేనేజ్‌మెంట్ చేయడం చేతకాకపోవడం వల్లే వరదలు వచ్చాయని చెప్పారు. ముంపు గ్రామాల్లో రైతులు పరిస్థితి అగోమ్యగోచరంగా ఉందని

తెలిపారు. ప్రాంతీయ పార్టీల వల్ల ప్రజలకు నష్టమన్నారు. జాతీయ పార్టీల వల్లే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఏపీలో ప్రాంతీయ పార్టీల వల్ల ఒరిగేదేమీలేదని సుజనా స్పష్టం చేశారు.

# అధికారన్ని అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు: బాబు

గుంటూరు,ఆగస్ట్30(ఆర్‌ఎన్‌ఎ): టీడీపీ నేతలతో ఆ పార్టీ అధినేత చంద్రబాబు సమావేశమయ్యారు. టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఆయన ఖండించారు. పాత కేసులు తవ్వడం వైసీపీ వేధింపులకు పరాకాష్ట అని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారని, గతంతో గాలి జనార్ధన్‌రెడ్డి మైనింగ్ దోపిడీపై పోరాడితే, ఇప్పుడు కేసులు పెడతారా అని ప్రశ్నించారు. వందలాది మంది కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని, ప్రశ్నించే హక్కు కాలరాయాలని చూస్తున్నారని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి అరాచక పాలన తన జీవితంలో చూడలేదన్నారు. మొత్తం పోలీసు వ్యవస్థనే నిస్సహాయంగా మార్చారని, పోలీసులే నిస్సహాయంగా మారితే ఇక రక్షణ ఎవరని మరోసారి ప్రశ్నించారు. వైసీపీ వేధింపులకు నిరసనగా సెప్టెంబర్ 3నుంచి టీడీపీ ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. మంగళవారం నుంచి గుంటూరులో వైసీపీ బాధితుల పునరాశ్రయ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. పల్నాడుతో సహా ఇతర ప్రాంతాల బాధితులకు ఆశ్రయం కల్పిస్తామని, బాధితులందరికీ న్యాయపరంగా రక్షణ కల్పిస్తామని చంద్రబాబు చెప్పారు.

# బురదజల్లడం మానుకోండి

### పాక్‌కు హెచ్చరించిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్30(ఆర్‌ఎన్‌ఎ): భారత్‌పై బురద జల్లే వ్యాఖ్యలు మానుకోవాలని విదేశీ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌కు స్పష్టం చేసింది. భారత అంతర్గత విషయమైన కశ్మీర్ వ్యవహారంలో పాక్ ప్రధాని ఇమ్రాన్ సహా ఇతర మంత్రులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ మండిపడ్డారు. పాక్ వ్యాఖ్యలు భారత్‌లో హింసకు పురిగొల్పేలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. దిల్లీలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఇక పాకిస్థాన్ ఒక సాధారణ పొరుగు దేశంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని హితవు పలికారు. మిగతా దేశాల మాదిరిగా పాకిస్థాన్ చర్చలు, వాణిజ్యం సహజంగా చేసుకోవాలని.. ఉగ్రవాదులను భారత్‌లోకి ఎగదోసే పని మానుకోవాలని హెచ్చరించారు. యితే, గుజరాత్‌లో హింస సృష్టించేందుకు పాక్ ఉగ్రవాదులు భారత ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించే అవకాశాన్ని రవీశ్ ధ్రువీకరించారు. ఈ మేరకు గుజరాత్‌లో హై అలర్ట్ ప్రకటించారని చెప్పారు.

శ్మీర్ విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా గత మూడు వారాలుగా పాక్ అధినాయకత్వం రకరకాల వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం సహా ప్రతి అంతర్జాతీయ వేదికపైనా లేవనెత్తుతామని సోమవారం కూడా పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యానించారు.

# శుద్ధమైన తాగునీరందించాలి

**– ఉద్దానం తాగునీటి ప్రాజెక్టును శ్రీకాకుళం జిల్లా అంతటికీ వర్తింపజేయండి**

**– వాటర్ గ్రిడ్ పథకం కింద మూడు దశల్లో పనులు**

**– అధికారులను ఆదేశించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి**

అమరావతి, ఆగస్టు30(ఆర్‌ఎన్‌ఎ) : రాష్ట్రంలోని ప్రజలందరికీ పరిశుద్ధమైన తాగునీటిని అందించేలా అధికారులు కృషిచేయాలని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. తాగునీటి సరఫరా అధికారులతో శుక్రవారం జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు చేపట్టాల్సిన పనుల్ని వారికి పలు సూచనలు చేశారు. ఉద్దానం తాగునీటి ప్రాజెక్టును శ్రీకాకుళం జిల్లా అంతటికీ వర్తింపజేయాలని చెప్పారు. వాటర్ గ్రిడ్ పథకం కింద మూడు దశల్లో పనులు చేపట్టాలని అధికాలకు ఆదేశాలు జారీ చేశారు. మొదటి దశలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల్లో.. రెండోదశలో విజయనగరం, విశాఖ, రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో... ఇక మూడోదశలో కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో శుభ్రమైన తాగునీటిని అందించాలని స్పష్టం చేశారు. నీటిని తీసుకున్న చోటే శుద్ధిచేసి అక్కడ నుంచే సరఫరా చేయాలని సీఎం ప్రాథమికంగా నిర్ణయించారు. కిడ్నీ బాధిత ప్రాంతాల్లో ట్రీట్‌మెంట్‌ప్లాంట్ నుంచి నేరుగా ఇళ్లకే తాగునీరు పంపిణీ చేయాలని చెప్పారు. ఈ అంశాలపై నిశిత అధ్యయనం చేసి, ప్రణాళిక ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న తాగునీటి చెరువులు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిగణలోకి తీసుకుని.. వాటిల్లో తాగునీటిని నింపిన తర్వాత అవి కలుషితం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఆలోచనలు చేయాలని సీఎం జగన్ సూచించారు. కిడ్నీ బాధిత ప్రాంతాల్లో ట్రీట్ మెంట్‌ప్లాంట్ నుంచి నేరుగా ఇళ్లకే తాగునీటిని పంపిణీచేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షా కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉభయ గోదావరి జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

### శ్రీశైలం ప్రాంతంలో చిరుత కలకలం

శ్రీశైలం,ఆగస్ట్30 (ఆంఎన్‌ఎ): శ్రీశైలం దేవస్థానం ఔటర్ రింగ్ రోడ్డులో చిరుతపులి సంచారం కలకలం రేపింది. చిరుతను చూసిన కర్ణాటక భక్తులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. తమ సెల్‌ఫోన్‌లో చిరుత సంచరిస్తు ఉండడాన్ని చిత్రీకరించారు.

రింగ్ రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న స్థానికులు భయాందోళనకు గురౌతున్నారు. చిరుత సంచారంతో భక్తులు జాగ్రత్తగా ఉండాలని, రింగ్ రోడ్డువైపు వెళ్ల వద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అటవీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమన్న ఉద్యోగులు

హైదరాబాద్,ఆగస్ట్30 (ఆర్‌ఎన్‌ఎ): విద్యుత్తు సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌పై కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ విద్యుత్తుసౌధ ఉద్యోగులు ధర్నా చేశారు. రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఉద్యోగులు ఈ సందర్భంగా డిమాండ్ చే?శారు. క్షమాపణలు చెప్పనిపక్షంలో రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా తమ భవివష్యత్తు కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని ఉద్యోగ నేతలు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఓటు కు నోటు దొంగ రేవంత్... ఖబడ్దార్ అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు.

# శక్తివంతమైన ప్రసార మాధ్యమం రేడియో

### ప్రధాని మన్‌కీ బాత్ ప్రజలకు చేరువయ్యింది: జవదేకర్

న్యూఢిల్లీ,ఆగస్ట్30(ఆర్‌ఎన్‌ఎ): ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తున్న 'మన్‌కీ బాత్'కార్యక్రమం ప్రస్తుతం 'దేశ్‌కీ బాత్', 'దిల్‌కీ బాత్'గా మారిందని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్ పేర్కొన్నారు. దిల్లీలో జరిగిన రేడియో జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు అవార్డులు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోని రేడియో స్టేషన్లు, అందులో పనిచేసే వారి ప్రాధాన్యతను జవడేకర్ కొనియాడారు. ప్రజలు నమ్మదగిన, శక్తివంతమైన ప్రసార మాధ్యమం రేడియో అని అన్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణిలో ప్రధాని మోదీ విజయవంతంగా కొనసాగిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమంపై ప్రశంసలవర్షం కురిపించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 262 రేడియో స్టేషన్లు ఉండగా, వాటిని 500కు పెంచి మళ్లీ రేడియో రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చాక 75రోజుల్లో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు, తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలతో 'జన్ కనెక్ట్' అనే పుస్తకాన్ని విడుదల చేశారు. విద్యాహక్కు చట్టం, రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందించడం సహా అన్ని చట్టాలు జమ్ము-కశ్మీర్‌లో అమలుచేసి ప్రజల జీవన విధానాన్ని మెరుగ పరిచేందుకే ప్రత్యేకహోదా రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణపోరాటంలో రాటుదేలి వచ్చాం

**కులాల కుంపట్లోంచి నాయకుడిగా రాలే**
**ఎత్తిన జెండా దించకుండా పోరాడిన ధీరులం**
**ప్రజలే చరిత్రనిర్మాతలు...నాయకులు కాదు**
**చిల్లర రాజకీయాలకు లొంగే వాడిని కాదు**
**హుజూరాబాద్ సభలో ఈటెల సంచలన వ్యాఖ్యలు**

కరీంనగర్, ఆగస్ట్ 30(ఆర్ఎన్ఎ): మంత్రి ఈటెల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హుజూరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉద్వేగపూరితంగా ప్రసంగించారు. బీసీ కోటాలో మంత్రి పదవి ఇవ్వాలని తాను ఎవరినీ అడగలేదని, చిల్లర ప్రచారంపై సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. నాయకులు చరిత్ర నిర్మాతలు కాదని, ప్రజలే చరిత్ర నిర్మాతలని వ్యాఖ్యానించారు. సొంతంగా ఎదగలేనివారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధర్మం, న్యాయం నుంచి ఎవరూ తప్పించుకోలేమని, ప్రజాక్షేత్రంలో వారికి శిక్ష తప్పదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. 15 ఏళ్లలో ఎవరి నుంచి డబ్బులు తీసుకోలేదని, నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఈటల చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో మూడున్నర కోట్ల ప్రజల ఆత్మగౌరవ బావుటా ఎగురవేశాను. నన్ను చంపాలని రెక్కీ నిర్వహించినప్పుడు చంపుతావా అని ఎదురెల్లి ఛాలెంజ్ చేశాను. చంపినా తెలంగాణ జెండా వదిలేది లేదని చెప్పాను. లక్షలాది మందితో కలిసి ఉద్యమం చేశాను. మధ్యలో వచ్చినోళ్లు కాదు... బతికొచ్చినోళ్లు కాదు.. అడుకొచ్చినోల్లం కాదు. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల గెలుపుకై ఉద్యమం చేపట్టి రాష్ట్రాన్ని సాధించాం. అందుకే మేము గులాబీ జెండా ఓనర్లమయ్యాం. అడుక్కొనే వాళ్ళం కాదు... అడుక్కునే వారు ఎవరో తెలుస్తుందని ఈటెల ఉద్వేగంగా మాటల్లాడారు. దొంగలు, మోసగాళ్లు ఒకసారి మోసం చేయొచ్చు... కానీ ధర్మాన్ని, న్యాయాన్ని మోసగించలేరు. చిల్లర ప్రచారంపై సమాధానం చెప్పాల్సిన పని లేదు. 15 సంవత్సరాల లో ఏ ఒక్కరి నుంచి 5 వేల రూపాయలు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతానంటూ ప్రకటించారు. ప్రతి ఒక్కరికి సహాయం చేశా. మంత్రి పదవి బిక్ష కాదు, కులానికి, బిసి కి ఇచ్చినట్లుగా కులంతో కొట్లాడలేదు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం కొట్లాడిన తెలంగాణ ఉద్యమం మూడున్నర కోట్ల ప్రజల ఆత్మగౌరవ బావుటా బావుటా ఎగురవేసిన. 1992లో నాటి సీఎం వైఎస్సార్ వద్దకు భూమి కోసం వెళ్లిన కానీ సహాయం చేయమని కోరలేదు. లక్షలాది మందితో కలిసి ఉద్యమం చేసినా.. మధ్యలో వచ్చినోన్నీ కాదు, బతికొచ్చినోన్నీ కాదు, అడుకొచ్చినోల్లం కాదు.. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల గెలుపుకై ఉద్యమం చేపట్టి, రాష్ట్రాన్ని సాధించాం.. అందుకే మేము గులాబీ జెండా ఓనర్లం.. అడుక్కొనే వాళ్ళం కాదు... అడుక్కునే వారు ఎవరో తెలుస్తది.. అధికారం శాశ్వతం కాదు. ధర్మం, న్యాయం మాత్రమే శాశ్వతం. నాయకులు చరిత్ర నిర్మాతలు కాదు, ప్రజలే చరిత్ర నిర్మాతలు. కుహనా వాదులు, కుసంస్కారులు సొంతగా ఎదగలేని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. ధర్మం, న్యాయం నుంచి ఎవరు తప్పించుకోలేరు ప్రజాక్షేత్రంలో వారికి శిక్ష తప్పదని అన్నారు.

# పాక్‌లో ప్రజాస్వామ్యం మేడిపండు చందం

**నవాజ్‌ను అణగదొక్కి అధికారంలోకి వచ్చారు**
**సైన్యం అండతో అధికారంలోకి వచ్చిన ఇమ్రాన్**
**అమెరికా నివేదిక వెల్లడి**

వాషింగ్టన్, ఆగస్ట్ 30 (ఆర్ఎన్ఎ): పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం ఉన్నా.. అదంతా మేడిపండు ప్రజాస్వామ్య మేనని, అసలు పెత్తనమంతా సైన్యానిదేనని అమెరికా కాంగ్రెస్ నివేదిక సీఆర్ఎస్ తెలిపింది. ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలో పాక్ విదేశాంగ విధానం, భద్రతా విధానాలన్నింటినీ సైన్యం తీవ్రంగా ప్రభావితం చేస్తోందని పేర్కొంది. అధికారంలోకి రావడానికి ముందు ఇమ్రాన్ ఖాన్‌కు ఎలాంటి పాలనా అనుభవం లేదని.. అయితే, అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్‌ను అధికారంలోనుంచి దించాలనే ఏకైక దురుద్దేశంతో ఎన్నికల సమయంలో పాక్ సైన్యం దేశీయ రాజకీయాలను తారు మారు చేసిందని సీఆర్ఎస్ నివేదిక స్పష్టంచేసింది. ఇమ్రాన్ సారథ్యంలోని తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ నయా పాకిస్థాన్ అన్న నినాదంతో ఎన్నికల బరిలోకి దిగి చాలా మంది యువ, పట్టణ, మధ్యతరగతి ఓటర్లను ఆకర్షి తుల్ని చేశారని.. అభివృద్ధికి సోపానాలు వేస్తున్నట్టు పైకి చెప్పినప్పటికీ అవేమీ సాకారం కావడం లేదని వెల్లడిమచింది. అవినీతిని నిరోధించడంతో పాటు మెరుగైన విద్య, ఆరోగ్య సంరక్షణను అందించే సంక్షేమ రాజ్యాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమని చెప్పినప్పటికీ ఆ దిశగా ఇమ్రాన్ ప్రయత్నాలేమీ చేయడంలేదని.. ఆయన సైన్యం చేతుల్లో కీలు బొమ్మలా మారిపోయారని తెలిపింది. పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక, రాజకీయ సంక్షోభం ఎదుర్కొంటోందని, దీన్నుంచి బయటపడాలంటే.. కొత్త దేశీయ రుణాలతో పాటు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది. పాక్ సైన్యం విదేశాంగ, దేశీయ భద్రతపై ఆధిపత్యం చెలాయించడమే ఎక్కువగా కనబడుతోందని తెలిపింది. నవాజ్ షరీఫ్‌ను అధికారం నుంచి తొలగించి, ఆయన పార్టీని బలహీనపర్చాలన్న ఉద్దేశంతోనే పాక్ భద్రతా దళాలు దేశీయ రాజకీయాలను రహస్యంగా తారుమారు చేశాయని చాలా మంది విశ్లేషకులు తమ అధ్యయనాల్లో పేర్కొన్నారని నివేదిక తెలిపింది. అలాగే, సైన్యం-న్యాయ వ్యవస్థ అపవిత్ర కలయిక ఇమ్రాన్ ఖాన్ పార్టీకి లబ్ధి చేకూర్చాయని నివేదికలో వెల్లడించింది. పాకిస్థాన్‌లో ప్రజాస్వామిక నిబంధనలు తీవ్ర దుర్వినియోగానికి గురవుతున్న అంశంపై ఎన్నికల పరిశీలకులు, మానవహక్కుల సంఘాలు గళం విన్పించాయని నివేదిక పేర్కొంది. నిషేధానికి గురైన జైష్, లష్కర్ తొయిబా, ఐసిస్ లాంటి ముష్కర గ్రూపులతో సంబంధం ఉన్న చిన్నచిన్న పార్టీలు గత ఎన్నికల్లో పాల్గొనడం మిలిటెంట్లకు మరింత ఊపునిచ్చాయి. 2018 లో జరిగిన ఎన్నికల్లో ఉగ్రవాద సానుభూతి రాజకీయపక్షాలు 10శాతం ఓట్లను సాధించడంపై నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది.

# నేనేం అత్యాచారం చేయలేదు!

**- తన మద్దతు దారులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు**
**- కర్ణాటక కాంగ్రెస్ నేత డి.కె. శివకుమార్**

న్యూఢిల్లీ, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : నేనేం అత్యాచారం, దొంగతనం చేయలేదని, తన మద్దతు దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కర్నాటక మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శివకుమార్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మరోసారి సమన్లు జారీ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని ఈడీ అధికారుల ఎదుట హాజరు కావాలని స్పష్టం చేశారు. తాజా సమన్లపై శివకుమార్ స్పందిస్తూ.. తానేమీ తప్పు చేయలేదని అన్నారు. కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దొని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా 84 ఏళ్ల నా తల్లి ఆస్తి మొత్తాన్ని విచారణ సంస్థలు బినామీ పేరుతో ఎటాచ్ చేశాయనీ, ఇప్పటికే తమ రక్తం మొత్తం పీల్చేశారని ఆయన ఆరోపించారు. పన్ను ఎగవేతలు, హవాలా లావాదేవీల ఆరోపణలపై డీకే శివకుమార్ సహా పలువురిపై ఈడీ అధికారుల గతేడాది సెప్టెంబర్‌లో కేసు నమోదు చేశారు. కాగా తాజాగా తనపై ఈడీ జారీ చేసిన సమన్లు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనంటూ డీకే ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్నందుకు, ఆ పార్టీ ఏం ఆదేశిస్తే అది చేస్తున్నందుకే కేంద్రం తనను టార్గెట్ చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం రాత్రి ఈడీ సమన్లు అందాయని, శుక్రవారం అధికారుల ఎదుట హాజరవుతున్నానని అన్నారు.. న్యాయవ్యవస్థపై నాకు నమ్మకం ఉందని, చట్టాన్ని గౌరవించి ఈడీ అధికారులకు సహకరిస్తానని శివకుమార్ అన్నారు. ఢిల్లీలోని శివకుమార్ నివాసంలో రూ.8.59 కోట్ల నగదును ఏడాదిన్నర కిందట ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పన్ను ఎగవేత, హవాలా బదిలీల ఆరోపణల కింద గతేడాది సెప్టెంబరులో ఆయనపై ఈడీ కేసు నమోదు చేసింది. ఇటీవల దర్యాప్తునకు రావాలంటూ ఈడీ సమన్లు జారీ చేసింది. అయితే ఈ సమన్లను సవాల్ చేస్తూ శివకుమార్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా.. ఆయన అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. దీంతో గురువారం రాత్రి మరోసారి ఈడీ సమన్లు ఇచ్చింది.

# రేణుకాచౌదరికి నాన్ బెయిలబెల్ వారెంట్ జారీ

ఖమ్మం, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీ రేణుకాచౌదరికి నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ అయింది. శుక్రవారం ఖమ్మం జిల్లా రెండో అదనపు ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయయమూర్తి వారెంట్‌ను జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. గతంలో ఆమెపై నమోదైన మోసం కేసుకు సంబంధించి నోటీసులు జారీ చేసినా కోర్టుకు హాజరు కాలేదు. దీంతో ఖమ్మం జిల్లా రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఈ మేరకు నాన్‌బెయిలబుల్ వారెంటు ఇష్యూ చేశారు.

గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తన భర్తకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానంటూ రేణుక తమను మోసగించిందని కళావతి అనే మహిళనకు దిగింది. తన భర్త నుంచి పెద్ద మొత్తంలో డబ్బు తీసుకొని వైరా నియోజకవర్గం టికెట్ ఇప్పిస్తానని ఆశచూపిందని, తీరా టికెట్ ఇప్పించక పోగా తీసుకున్న డబ్బులు ఇవ్వలేదని గత కొంతకాలం నుంచి ఆమె ఆందోళనకు దిగారు.

కళావతికి మద్దతుగా పలు సంఘాలు రేణుకకు వ్యతిరేకంగా ఆందోళన లు చేశాయి. వీటిపై స్పందించిన రేణుకాచౌదరి తాను ఎవరి వద్ద డబ్బులు తీసుకోలేదని, తనను కావాలనే బ్లాక్ మెయిల్ చేస్తు న్నారని మండిపడింది.

దీంతో కళావతి అనే మహిళ తనకు న్యాయం చేయాలంటూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు వివరణ ఇవ్వాల్సిందిగా రేణుకకు నోటీసు లు జారీ చేసింది. అయినా ఆ నోటీసులు తీసుకోక పోవడం, విచారణకు హాజరుకాకపోవడంతో కోర్టు తాజా వారెంటు జారీ చేసింది.

# పద్ధతిగా రావాలి!

**- ప్రభుత్వ ఉద్యోగులు జీన్స్, టీషర్టు వేసుకోవద్దు**
**- బీహార్ ప్రభుత్వం కొత్త ఆదేశాలు జారీ**

పాట్నా, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : బీహార్ ప్రభుత్వం సంచలన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నతాధికారులు కార్యాలయాలకు పద్ధతిగా రావాలంటూ అల్టిమేటం జారీ చేసింది. కొంతకాలంగా పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులందరూ ఉద్యోగులు జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు వేసుకుని ఆఫీసులకు వస్తున్నారు. దీంతో అలా కార్యాలయాలకు రావద్దంటు ప్రభుత్వ కార్యదర్శి మహాదేశ్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు సాధారణమైన బట్టలు అంటే ఫార్మల్స్ మాత్రమే వేసుకుని ఆఫీసుకు రావాలని ఉత్తర్వుల్లో సూచించింది. చాలామంది ఉద్యోగులు జీన్స్‌లు, టీషర్టు వేసుకుని ఆఫీసులకు వస్తున్నారనీ..ఇవి ఆఫీస్ పనిచేసే వాతావరణానికి తగినవి కాదని తెలిపారు. కాబట్టి ఉద్యోగులంతా ఫార్మల్ డ్రెస్ లు వేసుకుని రావాలని సూచించింది. ఇటీవల కాలంలో ఉద్యోగులందరూ జీన్స్, టీ షర్టులు ధరించి కార్యాలయానికి రావడం వల్లే.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ కార్యాలయ వాతావరణం, పనితీరు దెబ్బతినకుండా ఉండాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపింది. ప్రభుత్వం నిర్ణయంపై పలువురు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తుండగా, మరికొంత మంది ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారతీయ సాంప్రదాయాలు కాపాడాలంటే ఇలాంటి నిర్ణయాలు అనివార్యమని కొందరు పేర్కొంటున్నారు.

## ఏపీ వార్తలు

# ఏపీలో ఇసుక రాజకీయం

**- ప్రభుత్వం వల్లే ఇసుక కొరతంటూ టీడీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళన**
**- ముందస్తుగా పలువురి నేతల గృహనిర్బంధం**
**- ప్రభుత్వ తీరుకు నిరసనగా రోడ్లపైకి వచ్చిన టీడీపీ శ్రేణులు**
**- మంగళగిరిలో ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి లోకేశ్**
**- ఇసుక కొరత సృష్టించి పేదల పొట్ట కొట్టారు**
**-పేదల రాజ్యాన్ని పులివెందుల చేశారంటూ విమర్శలు**
**- ఇసుక కొరతను నిరసిస్తూ ప్లకార్డుల ప్రదర్శన**

అమరావతి, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : ప్రభుత్వ వైఖరి కారణంగానే ఏపీలో ఇసుక కొరత తలెత్తిందని ఆరోపిస్తున్న టీడీపీ.. జగన్ సర్కారు వైఖరికి నిరసనగా.. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. తెలుగు దేశం కార్యకర్తల్లారా కదలిరండి.. ఇసుక అక్రమాలపై నినదిద్దాం, నిలదిద్దాం, నిరసిద్దాం.. అని నారా లోకేశ్ పిలుపునిచ్చారు. దీంతో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్ల మీదకు రావడానికి ప్రయత్నించడంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. కానీ ముందు జాగ్రత్త చర్యగా ఏపీ ప్రభుత్వం టీడీపీ ముఖ్య నేతలను హౌస్ అరెస్ట్ చేసింది. చింతమనేని ప్రభాకర్, దేవినేని ఉమా లాంటి నేతలను గృహ నిర్బంధంలో ఉంచింది. ఏలూరులో పోలీసులు టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను గృహ నిర్బంధం చేశారు. ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు గో బ్యాక్ అంటూ టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ముందస్తు అరెస్టుల్లో భాగంగా.. కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు బచ్చుల అర్జునుడు, మాజీ మంత్రి దేవినేని ఉమాను కూడా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లో ఎమ్మెల్యే మద్దాలి గిరి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నక్కా ఆనందబాబు, డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం దేవినేని ఉమామహేశ్వరరావును పోలీసులు గొల్లపూడిలో హౌస్ అరెస్ట్ చేశారని ఆయన ఫేస్‌బుక్ పేజీ ద్వారా వెల్లడించారు. గొల్లపూడిలో ఇసుక కొరతపై రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు దేవినేని ఉమా బయల్దేరుతుండగా అప్పటికే పెద్దఎత్తున అక్కడకు చేరుకున్న పోలీసులు దేవినేని ఉమాను హౌస్ అరెస్ట్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు వెళుతున్న తమను హౌస్ అరెస్ట్ చేయడం ప్రభుత్వ దుర్మార్గ చర్యగా ఉమా అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, ఇసుక కృత్రిమ కొరతను సృష్టించి పేదలకు ఉపాధి లేకుండా వారి జీవనభృతికి ఇబ్బందులు కలిగేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ప్రజల ఆకాంక్షలను, ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేయడం కోసం తాము చేస్తున్న నిరసన కార్యక్రమాలను నిరంకుశ విధానాలతో పోలీసులను పంపించి ప్రభుత్వం అడ్డుకుంటుందని ఇలాంటి విధానాలతో తమను అడ్డుకోలేరని ఈ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని దేవినేని ఉమా హెచ్చరించారు. ఇదిలా ఉంటే ఏపీలో ఇసుక కొరత సృష్టించి నిరుపేదలకు పనుల్లేకుండా చేసి వారి పొట్టకొట్టారని టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో తీవ్ర ఇసుక కొరతను నిరసిస్తూ గుంటూరు జిల్లా మంగళగిరిలో టీడీపీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఉదయం ఆయన ధర్నాకు దిగారు. పాతబస్టాండ్ వద్ద మూతపడిన అన్న క్యాంటీన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేయడమేకాక, ప్లకార్డులు ప్రదర్శించారు. కాగా, ధర్నాలో పాల్గొన్న పలువురు నిర్మాణ రంగ కూలీలు ఇసుక కొరత వల్ల పనులు నిలిచిపోయి ఉపాధి లేక తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ పేదల రాజ్యాన్ని జగన్ పులివెందులుగా మార్చేశారని ధ్వజమెత్తారు. మూడు నెలల వైసీపీ పాలనలో రాష్ట్రం మూడేళ్లు వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలు తుగ్లక్ పాలన చూస్తున్నారని చెప్పారు. ఇసుక ధర 9 రెట్లు ఎందుకు పెరిగిందని నిలదీశారు. అమరావతిలో పనులు నిలిచిపోవడంతో వేల మంది ఉపాధి కోల్పోయారన్నారు. 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**దుర్మార్గపు వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం - అచ్చెన్నాయుడు**

అవగాహన లేని దుర్మార్గపు వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరమని టీడీపీ నేత అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజావేదిక కూల్చి అశుభంతో జగన్ పాలన ప్రారంభించారన్నారు. వరద కష్టాల్లో ప్రజలుంటే జగనేమో విదేశీ పర్యటనలు చేశారని విమర్శించారు. ఒక్క అవకాశం ఇద్దామనుకున్న ప్రజల నమ్మకాన్ని జగన్ వమ్ము చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిమెంట్ కంపెనీలతో కమిషన్ కుదరకపోవటంతోనే ఇసుక కృత్రిమ కొరత సృష్టించారని ఆరోపించారు. ప్రభుత్వం కొత్త నాటకం మొదలు పెట్టిందని ధ్వజమెత్తారు. ఇసుక టెండర్ల పేరుతో వైసీపీ నేతలకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ఇసుక కొరత వల్ల 20 లక్షల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక ద్వారా 900 కోట్లు ఆదాయం వచ్చేదన్నారు. అయినా చంద్రబాబు మాత్రం ప్రజలకు ఉచిత ఇసుక ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో ట్రాక్టర్ ఇసుక రెండు వేలు ఉంటే.. ఇప్పుడేమో 10 వేలు అయిందన్నారు. మిగతా 8 వేలు ఏ పంది కొక్కులు తింటున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలవరంపై కోర్టు మందలించినా ప్రభుత్వం మొండిగా ముదుకెళ్తోందన్నారు. రాజధాని అమరావతిపై మంత్రి బొత్స వ్యాఖ్యలు అవగాహన రాహిత్యంగా చెప్పుకొచ్చారు. రాజధానిలో టీడీపీ నేతలకు భూములున్నాయని ఆరోపించడం కాదన్నారు. ప్రభుత్వంలో ఉండి గాడిదలు కాస్తున్నారా? అని ప్రశ్నించారు. ఒకవేళ టీడీపీ నేతలకు భూములుంటే ఆ వివరాలను ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

**టీడీపీ ఎమ్మెల్యే అరెస్టు.. కార్యకర్తల ఆందోళన...**

పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు నివాసంవద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఇసుక ఇబ్బందులపై రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఆందోళనకు పిలుపు ఇచ్చినే నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా పోలీసులు టీడీపీ నేతలను హౌస్ అరెస్టులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం తెల్లవా రుజామున పోలీసులు నిమ్మల నివాసం వద్ద మోహరించారు. అనంతరం ఆయనను నరసాపురం తీసుకువెళుతున్నట్టు చెప్పారు. అయితే చించినాడ మీదుగా తూర్పుగోదావరి తరలించారు. దీంతో కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే నిమ్మల స్వచ్ఛందంగా తాను వస్తానని చెబుతున్నప్పటికీ పోలీసులు దౌర్జన్యంగా లాక్కెళ్లారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. అయితే రాష్ట్రంలోని టీడీపీ శ్రేణులు అందర్నీ హౌస్ అరెస్టుచేసి కేవలం పాలకొల్లు ఎమ్మెల్యేను అరెస్ట్ చేసి బయటకు తీసుకు వెళ్లడం చర్చనీయాంశమైంది.

**అవినీతి ఎందుకు నిరూపించలేకపోతున్నారు: అవినాష్**

టీడీపీ హయాంలో అవినీతి జరిగిందని చెబుతున్న సీఎం జగన్ ఎందుకు నిరూపించలేకపోతున్నారని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు దేవినేని అవినాష్ ప్రశ్నించారు. ఇసుక కొరతను నిరసిస్తూ విజయవాడ అలంకార్ సెంటర్ ధర్నాచౌక్‌లో టీడీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే బోండా ఉమ, దేవినేని అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడారు. ఇసుక కొరత వల్ల లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. వైసీపీ ప్రజాప్రతినిధులు ఇసుక క్వారీల మాటున లక్షలు దోచుకునేందుకే కృత్రిమ ఇసుక కొరత సృష్టించారని ఆరోపించారు. కొత్త పాలసీ పేరుతో క్వారీలను మూసివేయడం అన్యాయమన్నారు. కొత్త పాలసీ తీసుకు వచ్చే దాకా పాత పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తక్షణం ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ దంపతులకు స్వామి ప్రసాదాలు అందచేసిన ఇవో అశోక్ కుమార్ సింఘాల్

# శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**అభిషేక సేవలో పి.వి. సింధు**

తిరుపతి, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు శుక్రవారం దర్శించుకున్నారు.

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు శుక్రవారం తెల్లవారుజామున తిరుమల శ్రీవారిని దర్శించు కున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆమె అభిషేక సేవలో పాల్గొన్నారు. నిజపాదసేవలో శ్రీవారిని దర్శించుకున్నారు.

అనంతరం రంగనాయకుల మండపంలో వేదపడింతులు ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు.

సింధూ వెంట ఆమె తల్లిదండ్రులు, పలువురు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే శ్రీవారిని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లాలు దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా రంగనాయకుల మండపంలో వేదపండితులు కేంద్ర మంత్రికి ఆశీర్వచనాలు అందజేశారు. కేంద్ర మంత్రి వెంట పలువురు ఏపీకి చెందిన బీజేపీ నేతలు ఉన్నారు.

# ఐక్యరాజ్యసమితిలో ప్రధాని మోడీ ప్రసంగం

## 27 రాత్రి ఉంటుందని వెల్లడించిన సమితి

న్యూఢిల్లీ,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): భారత ప్రధాని నరేంద్రమోదీ సెప్టెంబర్ 27న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో మోదీ వాతావరణ మార్పు, ఆరోగ్యం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, చిన్న ద్వీపాలకు సహకారం వంటి పలు అంశాలపై మాట్లాడనున్నట్లు సమాచారం.

భారత కాలమానం ప్రకారం.. సెప్టెంబర్ 27న రాత్రి 7:30 గంటల నుంచి 08:00 గంటల వరకు మోదీ ప్రసంగించనున్నారని యూఎన్ విడుదల చేసిన ప్రాథమిక జాబితా ద్వారా తెలుస్తోంది. పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అదేరోజు అర్ధరాత్రి సమయంలో మాట్లాడే అవకాశం ఉంది. సమావేశం నుంచి కొందరు నాయకులు తప్పుకుంటే ఇమ్రాన్ ఖాన్‌కు నిర్ణీత సమయం కన్నా ముందే మాట్లాడే అవకాశం లభిస్తుంది. ప్రస్తుత పరిణామాల ప్రకారం ఇమ్రాన్ ఖాన్ తన ప్రసంగంలో భారత్‌లో కశ్మీర్‌కు ఆర్టికల్370 రద్దు చేసిన నేపథ్యంలో అక్కడ మానవ హక్కుల ఉల్లంఘనపై మాట్లాడేందుకు అవకాశం ఉంది. ఆయన ఎలాంటి ఆరోపణలు చేసినా వాటిని ఖండించడానికి భారత్ తన హక్కును ఉపయోగించుకుంటుందని భారత ప్రతినిధులు తెలిపారు. ఐరాస సమావేశాల కోసం మోదీ సెప్టెంబర్ 23న న్యూయార్క్ చేరుకోనున్నారు. పర్యటనలో భాగంగా ప్రవాస భారతీయులతో సమావేశమవుతారు. ఆ తర్వాత యూఎన్‌జీఏ సమావేశంలో ప్రసంగించిన అనంతరం భారత్‌కు తిరిగి పయనమవుతారు. ఈ పర్యటనలో ఆయన పలువురు ప్రపంచ స్థాయి నాయకులతో సమావేశం కానున్నారని సమాచారం.

# మధ్యాహ్న భోజన సమయంలో వేరుగా భోజనాలు

లక్నో,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): దేశంలో నానాటికీ కుల వివక్ష వికృత రూపం దాలుస్తోంది. సమాజంలో అక్కడక్కడ ఇలాంటి ఘటనలు జరుగుతుండడం ఈ మధ్య వార్తల్లో తరచూ చూస్తున్నాం. కుల వివక్షకు సంబంధించిన సంఘటన బాలియా జిల్లాలోని రాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. ఆజంఖాన్ ఇక్కడ ఇనుంచే ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కొందరు అగ్ర వర్ణాలకు చెందిన విద్యార్థులు, దళిత విద్యార్థులు తమతో కలిసి భోజనం చేయకూడదని, వారిని వేరేగా కూర్చొని తినమని చెప్పారు. దీంతో తప్పని పరిస్థితిలో ఆ విద్యార్థులు వారికి దూరంగా కూర్చొని భోజనం చేశారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న ప్లేట్స్‌లో తినకుండా వారి ఇళ్ల నుంచి ప్లేట్స్ తెచ్చుకుంటున్నారు. విషయం గురించి ప్రిన్సిపల్‌ని ప్రశ్నించగా, వారు వేరేగా ప్లేట్స్ తెచ్చుకోవడం, వేరేగా కూర్చుని తినడంపై పలు మార్లు వారించాను. స్కూల్‌లో ఉన్న ప్లేట్స్‌లోనే తినాలని, అందరూ కలిసి తినాలని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకూడదని చెప్పినప్పటికీ వారు అలాగే చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ విషయంపై బీఎస్పీ అధ్యక్షురాలు, యూపీ మాజీ సీఎం మాయావతి విచారం వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ఇలాంటి ఘటన జరగడం దారుణం. అంటరాని తనం రూపు మాపాల్సింది స్కూలు స్థాయిలోనే, అలాంటిది ప్రైమరీ స్కూల్‌లో ఇలాంటి ఘటన జరగడం దరుణం అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వార్తా నా మనసును కలచి వేసింది. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా జగ్రత్తలు తీసుకోవాలని ఆమె పాఠశాల ఉపాధ్యాయులను కోరింది. ఇటీవలి కాలంలో యూపీలోని మిర్జాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో రొట్టె, ఉప్పు పెట్టడం వార్తల్లో చూశాం. జాతీయ మానవ హక్కుల కమిషన్ సైతం ఈ ఘటనలపై తీవ్రంగా స్పందించింది. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలన్నారు. కాగా, మిర్జాపూర్ స్కూల్‌లోని లంచ్ ఘటన సోషల్ మీడియా ద్వారా వెలుగు చూడడంతో దానికి సంబంధించిన ఒక ఉపాధ్యాయుడ్ని, మరో ఇద్దరిని విద్యాశాఖ సస్పెండ్ చేసింది.

# పర్యావరణానికి జై కొడదాం

## –మట్టి గణపతులనే పూజిద్దాం: పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్,ఆగస్ట్30(నేటినిజం ప్రతినిధి) ప్రతి ఒక్కరం కలిసికట్టుగా మట్టి గణపతును పూజించేలా ప్రజలను ప్రోత్సహించాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు. అందరూ పర్యావరణహితం కోరి మట్టి గణపతులను పూజించాలన్నారు. దీంతో పర్యావరణం కాపాడిన వారం అవుతామన్నారు. ప్రధానంగా చిన్నారులు ఈ బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే పనిచేసి పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట వేద్దామని ఎమ్మెల్యే అన్నారు. మొక్కలు నాటడం, డంప్‌యార్డు నిర్మాణం, శ్మశాన వాటిక నిర్మాణం తదితర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డంపుయార్డ్‌కు తరలించాలని గ్రామస్తులకు సూచించారు. ఇకపోతే పర్యావరణానికి సవాల్‌గా మారిన ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో చెత్తను విచ్చలవిడిగా రోడ్లపై పారవేయవద్దన్నారు. విచ్చలవిడిగా చెత్తను పారవేస్తే అట్టి చెత్త మురికి కాల్వల్లోకి చేరి మురికి నీరు నిలిచి దోమలు అధికమై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేయాలన్నారు. నిర్మించుకున్న మరుగుదొడ్లను వినియోగించుకోవాలని సూచించారు.

బహిరంగ మలవిసర్జన చేస్తే ఫించన్‌తో పాటు రేషన్, కరెంటు సరఫరాను నిలిపి వేస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు ఓ పెను భూతంలాంటిదన్నారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ కుళ్లు రాజకీయాలు

## –పాలమూరు ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తాం: కర్నె

హైదరాబాద్,ఆగస్ట్30 (ఆర్ఎన్ఎ): రికార్డు సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని టిఆర్ఎస్ ఎంఎల్సి కర్నె ప్రభాకర్ తెలిపారు. పాలమూరు ప్రాజెక్టును కూడా అనుకున్న సమయంలోనే పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం లో బాధ్యత లేని ప్రతిపక్షం ఉందని ఆయన ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని సిఎం కెసిఆర్ ఎన్నోసార్లు కేంద్రాన్ని కోరారని, కానీ కేంద్రం పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్ నేతలు అజ్ఞానంతో మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. త్వరితగతిన తాము ప్రాజెక్టులను నిర్మిస్తుంటే, కాంగ్రెస్ నేతలు కళ్లుండి చూడలేని కబోదుల్లా మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్ నేతలకు, ఇతర ప్రతిపక్షాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు.

# చిదంబరం పిటిషన్‌పై 5న తీర్పు

న్యూఢిల్లీ,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం వ్యవహారంలో అరెస్టయిన కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి పి. చిదంబరం పిటిషన్‌పై సెప్టెంబరు 5న తీర్పు వెల్లడిస్తామని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. అప్పటిదాకా ఈడీ అధికారులు ఆయనను అరెస్టు చేయకుండా న్యాయస్థానం తాత్కాలిక రక్షణ కల్పించింది. ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ కస్టడీలో ఉన్న చిదంబరం.. ఈడీ కేసులో అరెస్టు నుంచి రక్షణ కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ ఎ.ఎస్. బోపన్నల ధర్మాసనం సెప్టెంబరు 5న తీర్పును వెల్లడించనున్నట్లు తెలిపింది. అంతేగాక, ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఈడీ కోర్టుకు తెలియజేయాలనుకుంటే వాటిని సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించింది. మరోవైపు చిదంబరానికి విధించిన సీబీఐ కస్టడీని ఈ నెల 30 వరకు పొడిగిస్తూ దిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే సెప్టెంబరు 2 వరకు తాను సీబీఐ కస్టడీలోనే ఉంటానని చిదంబరం కోర్టుకు విన్నవించారు. ఇందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. సీబీఐ కస్టడీ పొడిగింపుపై కేవలం సీబీఐ కోర్టు మాత్రమే ఆదేశాలిస్తుందని తెలిపారు. దీంతో చిదంబరం అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది.

# నేడే అసోం పౌరుల తుది జాబితా

గౌహతి, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : అసోం రాష్ట్ర పౌరుల తుది జాబితా శనివారం ఉదయం 10 గంటలకు విడుదల కానుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసోం ప్రభుత్వం చేపట్టిన జాతీయ పౌరసత్వ రిజిస్టర్(ఎన్ఆర్సీ) కార్యక్రమం ఈ నెల 31తో ముగియనున్న విషయం తెలిసిందే. అసోంలో నివసిస్తూ.. ఆ జాబితాలో పేరు లేనివారిని ఇకపై విదేశీయులుగా పరిగణిస్తారు. అటువంటి వారిని నిర్బంధ కేంద్రాలకు తరలిస్తారు. ఒకవేళ వారు భారతీయులే అయితే.. ట్రిబ్యునళ్లను ఆశ్రయించి తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవచ్చు. కాగా ఎన్ఆర్సీ జాబితాలో 41 లక్షల మంది నమోదుకు నోచుకోలేదు. వీరంతా ఇకపై విదేశీయులుగా పరిగణించబడుతారు. పౌరులు శనివారం ఉదయం ఆన్‌లైన్‌లో తమ పేర్లను చూసుకోవచ్చు. ఇంటర్‌నెట్ కనెక్షన్ లేనివారు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సేవా కేంద్రాలకు వెళ్లి జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవచ్చ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు.

# బాధ్యతల నుంచి తప్పుకున్న ఢిల్లీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్

న్యూఢిల్లీ,ఆగస్ట్30 (ఆర్ఎన్ఎ): ఢిల్లీలో మరో 6 నెలల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఢిల్లీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా ఉన్న పీసీ చాకో తనకు విధుల నుంచి ఉపశమనం కలిగించాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు. షీలా దీక్షిత్ మరణానంతరం ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఖాళీ ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ పీసీ చాకో, జిల్లా అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఢిల్లీ విభాగానికి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే విషయంపై వారితో చర్చించారు.

సమావేశం జరిగిన రెండు రోజుల్లోనే పీసీ చాకో తనను తప్పించాలని కోరడం చర్చనీయాంశమైంది.

అధ్యక్ష స్థానానికి బరిలో నవ్‌జ్యోత్ సిద్ధూ, శత్రుఘ్నసిన్హా ఉన్నట్లు వస్తున్న వార్తలను పీసీ చాకో కొట్టిపారేశారు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఢిల్లీకి చెందిన వ్యక్తే ఉంటారని చాకో స్పష్టం చేశారు.

# దేశంలో నెలకు 23 విమాన ప్రమాదాలు

## డీజీసీఏ అధికారి అరుణ్ కుమార్

న్యూఢిల్లీ,ఆగస్ట్30 (ఆర్ఎన్ఎ): దేశంలో నెలకు 23 విమాన ప్రమాదాలు జరుగుతున్నాయని భారత విమానయాన శాఖకు సంబంధించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. ప్రతి రోజు ఎక్కడో ఒక చోట విమాన ప్రమాదం జరుగుతుందని డీజీసీఏ అధికారి అరుణ్ కుమార్ తెలిపారు. విమానాలను పక్షులు ఢీకొట్టడం, ధూళి, తుపాను, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పాటు సాంకేతిక సమస్యలతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో ప్రతి రోజు సుమారు 8 వేల విమానాలు తిరుగుతున్నాయని, వీటిలో స్వదేశీ విమానాలు 3,500 వరకు ఉంటాయని చెప్పారు. అయితే ఈ మధ్య కాలంలో ఏటీసీ అధికారులు.. పైలట్‌లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేస్తున్నారని వెల్లడించారు.

# పంచయితీలను నిర్వీర్యం చేశారు: మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మం,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా వాటిని నిర్వీర్యం చేసిందని సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. టీఆర్ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలకు నిధులు లేవని, పాలకవర్గాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఖమ్మం జిల్లా మధిర మండలం దేశినేని పాలెంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ మొదటి దఫా ఐదేళ్లలో, ఇప్పుడు ఏడునెలల్లో పంచాయతీలకు ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించలేదన్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, రాష్ట్రం మొత్తం విషజ్వరాలు ప్రబలాయని, ఏ ఆసుపత్రి చూసినా జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయన్నారు. మాయమాటలతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

# కయ్యానికి కాలుదువ్వుతోన్న పాక్

- భారత్‌ను టార్గెట్ చేస్తూ క్షిపణి పరీక్ష
- వివిధ రకాల వార్‌హెడ్లను మోసుకుపోగల సామర్థ్యం దీనిసొంతం
- లూచిస్థాన్ లోని టెస్ట్ రేంజ్ నుంచి క్షిపణి ప్రయోగం
- ట్విట్టర్‌లో వీడియోను షేర్ చేసిన పాక్ ఆర్మీ

ఇస్లామాబాద్, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పిస్తోన్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను రద్దుచేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో సరిహద్దుల్లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకుంది. భారత్ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తోన్న పాకిస్థాన్ కయ్యానికి కాలుదువ్వుతోంది. ఈ అంశంలో పాక్ చేస్తోన్న వాదనకు అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు లభించకపోవడంతో మరింత అసహనం వ్యక్తంచేస్తోంది. భారత్‌తో యుద్ధం తప్పదంటూ పరోక్షంగా రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోన్న పాక్.. అణు యుద్ధానికి కూడా కూడా వెనుకాడబోమని ప్రకటించింది. దీనికి అనుగుణంగానే పాక్ సన్నాహాలు చేస్తోంది. తాజాగా, బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని నిర్వహించి ఉద్రిక్తతలను మరింత పెంచేసింది. ఉపరితలం నుంచి ఉపరితలంపై అణ్వాయుధాలను ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణి 'ఘజ్నవీ'ని విజయవంతంగా పరీక్షించినట్టు గురువారం పాక్ ఆర్మీ ప్రకటించింది. రాచీ మీదుగా వెళ్లే గగనతలంలోని మూడు మార్గాలను ఆగస్టు 31 వరకు మూసివేస్తున్నట్టు పాక్ సివిల్ ఏవియేషన్ అథారిటీ బుధవారం ప్రకటించడంతో బలూచీస్థాన్‌లో క్షిపణి ప్రయోగానికి సిద్ధమైనట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనిని నిజం చేస్తూ గురువారం తెల్లవారు జామున క్షిపణిని పరీక్షించింది. దీనిపై పాకిస్థాన్ మిలటరీ మీడియా అధికార ప్రతినిధి మేజర్ జనరల్ అసిఫ్ గఫూర్ ట్విట్టర్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. పాక్ తాజాగా జరిపిన క్షిపణి పరీక్షకు సంబంధించిన దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. 290 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలనే చేరుకునే సామర్థ్యం గలిగిన ఘజ్నవీ క్షిపణి.. వివిధ రకాల వార్‌హెడ్లను మోసుకుపోగలదు. భారత్‌లో పలు ప్రాంతాలు దీని పరిధిలోకి వస్తాయి. అత్యంత వేగంగా ప్రయాణించే బాలిస్టిక్ క్షిపణిగా దీనిని పాకిస్థాన్ అభివృద్ధి చేసిందని నిపుణులు పేర్కొంటున్నారు. సంప్రదాయ, అత్యాధునిక పేలుడు, అణ్వాయుధాలతో కూడిన వార్‌హెడ్ కలిగి ఉండటం దీని ప్రత్యేకత. ఘజ్నవీను విజయవంతంగా పరీక్షించినందుకు జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఆఫ్ పాకిస్థాన్ ఛైర్మన్ సహా త్రివిధ దళాలకు చెందిన అధినేతలు అభినందించినట్టు గఫూర్ తన ట్వీట్‌లో తెలియజేశాడు. అంతేకాదు, పాకిస్థాన్ అధ్యక్షుడు అరిఫ్ అల్వీ, ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సైతం ఈ ఘనత సాధించినందుకు తమ అభినందనలు తెలియజేసినట్టు వివరించాడు. కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పిస్తోన్న ఆర్టికల్ 370ని భారత్ రద్దుచేసి, దానిని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. దీనిని అంతర్జాతీయ అంశం చేయాలని భావిస్తోన్న పాక్ అణ్వాయుధ పరీక్షలు నిర్వహించడం గమనార్హం. కశ్మీర్‌పై పాక్ ప్రధాని ఇమ్రాన్ పదే పదే అణు యుద్ధం గురించి హెచ్చరికలు చేస్తోన్న సంగతి తెలిసిందే.

## వసతి గృహాల్లో..

# అన్ని సదుపాయాలుండాలి

- నిరంతరం అధికారులు తనిఖీలు నిర్వహించాలి
- ఖాళీ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టండి
- డిమాండ్ ఉన్నచోట కొత్త హాస్టళ్ల కోసం ప్రతిపాదనలు ఇవ్వండి
- వచ్చే ఏడాది నుంచి వైఎస్ఆర్ చేయూత పథకం
- ఈ పథకానికి లబ్ధిదారులను గుర్తించండి
- ఎస్సీలకు, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలి
- ఈ మేరకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టాలి
- ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

అమరావతి, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : వసతి గృహాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖలపై గురువారం సమీక్ష నిర్వహించిన ఆయన ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు నాణ్యంగా ఉండాలని, దీని మీద అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలకు సంబంధించి తొమ్మిది రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని, వీటిని మూడు దశల్లో అమలు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇక అధికారులు క్రమం తప్పకుండా వసతి గృహాల్లో కనీస సౌకర్యాల ఉన్నాయో లేదో పరిశీలిస్తూ, నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. డిమాండు ఉన్నచోట కొత్త హాస్టళ్ల కోసం ప్రతిపాదనలు ఇవ్వాలని, ప్రతి వసతి గృహంలోనూ టాయిలెట్స్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. హాస్టళ్లలో వసతుల సౌకర్యం కోసం కలెక్టర్లకు నిధులు ఇచ్చారా? లేదా? అని సీఎం ప్రశ్నించగా.. ఇచ్చామని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి స్కూలు తెరిచే సమయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ యూనిఫామ్స్, పుస్తకాలు అందాలని పేర్కొన్నారు. 309 వసతి గృహాల్లో వంట మనుషులు, వాచ్‌మన్ సహా ఖాళీగా ఉన్న 927 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని, దీనికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నామినేటెడ్ పోస్టులు, పనుల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించాలని సూచనలు చేశారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందరికీ ప్రభుత్వ పథకాలు అందాలని, పథకాల అమల్లో పారదర్శకత ఉండాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి 45 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు ప్రతి ఏటా రూ. 1870 సంతృప్తికర స్థాయిలో వైఎస్సార్ చేయూతను ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సాలూరులో గిరిజన యూనివర్శిటీ, పాడేరులో గిరిజన వైద్య కళాశాల, కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాలతోపాటు, 7ఐటీడీఏ ప్రాంతాలు (అరుకు, పాలకొండ, పార్వతీపురం, రంపచోడవరం, చింతూరు, కె.ఆర్.పురం, దోర్నాల)లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. గిరిజనులకు అటవీ భూముల పట్టాలు ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఎస్సీలకు, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని, ఈ మేరకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టాలని సూచించారు.

## సెలైన్‌లో విషం ఎక్కించుకొని

# వైద్యుడి కుటుంబం ఆత్మహత్య

## – అమలాపురంలో విషాద ఘటన

కాకినాడ, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : సెలైన్‌లో విషం ఎక్కించుకొని ఓ కుటుంబ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రామకృష్ణరాజు భార్య, కుమారుడితో సహా ఆత్మహత్య చేసుకున్నారు. సెలైన్‌లో విషం ఎక్కించుకుని డాక్టర్ రామకృష్ణరాజు, భార్య లక్ష్మి, కుమారుడు సందీప్ ప్రాణాలు తీసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

డాక్టర్ రామకృష్ణరాజు అమలాపురంలో కృష్ణ ఆర్థోపెడిక్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. హస్తవాసి ఉన్న వైద్యుడిగా పేరు సంపాదించారు. అలాగే ఆయన కుమారుడు ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అయితే ఉన్నట్టుండి కుటంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవడంతో బంధువులు, స్థానికులు షాక్ అవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకొని ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్యుడి కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా తీవ్రవిషాదాన్ని నింపింది. ఆర్థోపెడిక్ వైద్యుడిగా రామకృష్ణకు మంచి గుర్తింపు ఉంది. ఆయన వద్దకు వెళితే ఎలాంటి నొప్పులైనా మటుమాయం అవుతాయని స్థానికులు విశ్వాసం. దీంతో ఆర్థోపెడిక్‌కు సంబంధించిన చికిత్సకు స్థానికులు ఎక్కువగా రామకృష్ణనే ఆశ్రయిస్తుంటారు. ఎప్పుడూ అందరితో మర్యాదపూర్వంగా మాట్లాడే రామకృష్ణ కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవటం స్థానికులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఇదిలా రామకృష్ణ కుటుంబ ఆత్మహత్యతో బంధువులు కన్నీటి పర్యాంతమవుతున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై ఆరాతీసున్నారు. మరోవైపు బంధువుల్ని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. వీరికి ఎవరితోనైనా శత్రుత్వం ఉందా? ఆస్తిపాస్తుల తగాదాలు ఉన్నాయా? అప్పుల్లో ఏమైనా ఉన్నారా? మరే ఇతర కారణాలు ఆత్మహత్యకు దారితీసుంటాయి అనే వాటిపై పూర్తి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉంటే రూ.10కోట్లు అప్పులు ఉన్నాయని, వీటిని వదిరాపాయలకు వడ్డీకి తీసుకున్నాడని, వాటిని తీర్చే పరిస్థితి లేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

## సిఎం ఇలాకాలో ప్రతి ఒక్కరికీ అవకాశం: గడా అధికారి

గజ్వేల్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ ఇండ్లు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ కొత్త పాలసీపై అధ్యయనం చేస్తున్నారని, పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని గడ ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ నియోజకవర్గం అయినందున లిమిట్ లేకుండా అర్హులైన వారందరికీ ఇండ్లను కేటాయించడం జరుగుతుందన్నారు. ఇండ్లులేని నిరుపేదలు పంచాయతీ కార్యాలయాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు డబుల్ బెడ్ రూం ఇండ్ల జాబితాను తాము సేకరించలేదని, కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వివరాలు సేకరిస్తారన్నారు.

పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్దిదారులకు ఇండ్ల మంజూరు కేటాయింపు జరుగుతుందని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కావద్దని సూచించారు. నూతన పంచాయతీరాజ్ చట్టానికి అనుగుణంగా గ్రామాల్లో హరితహారం, పారిశుధ్యం పనులపై దృష్టి సారిస్తేనే నిధులు కేటాయింపు జరుగుతుందని అన్నారు. మొక్కలు పెంచడంతో పాటు వాటిని సంరక్షించాలని, పరిశుభ్రతపై దృష్టి కేంద్రీకరించాలన్నారు.

వివిధ గ్రామాల్లో జరిగిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఎస్సీ కాలనీ, వాటర్ ట్యాంక్ తదితర ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కొంత మంది గ్రామస్తులు కోరారు. అయితే కాంట్రాక్ట్ వ్యవస్థ లేకుండా ఖాళీ స్థలాలున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

క్రీడలు

# అఫ్రిదికి బుర్ర పెరగలేదు

## - ఘాటు వ్యాఖ్యలు చేసిన ఎంపీ గౌతమ్ గంభీర్



ముంబయి, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : పాక్ మాజీ క్రికెటర్ అఫ్రిదికి బుర్ర పెరగలేదని, అందుకే అనవసర వ్యాఖ్యలు చేస్తున్నాడని మాజీ క్రికెటర్, ఎంపీ గౌతమ్ గంభీర్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు గురువారం ట్విటర్‌లో పోస్టుచేశారు. అతడికి వయసు, బుర్ర పెరగలేదని పేర్కొన్నాడు. కొందరు మనుషులకు తాము ఏం మాట్లాడుతున్నామో అర్థంకాదని వ్యంగ్యంగా అన్నాడు. ప్రధాని పిలుపునిచ్చిన కశ్మీర్ అవర్‌కు ఒక జాతిగా స్పందించండి. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నేను మహ్మద్ అలీ జిన్నా సమాధి వద్ద ఉంటాను. మన కశ్మీరీ సోదరులకు సంఘీభావం ప్రకటించేందుకు నాతో కలవండి, సెప్టెంబర్ 6న నేను అమరవీరుల స్వస్థలం సందర్శిస్తాను. త్వరలోనే నియంత్రణ రేఖ వద్ద పర్యటిస్తానని అఫ్రిది బుధవారం ట్వీట్ చేశాడు. అతడికి గౌతమ్ గంభీర్ ఘాటుగా బదులిచ్చాడు. మిత్రులారా, షాహిద్ అఫ్రిది అవమానం పాలయ్యేందుకు తర్వాత ఏం చేయాలని షాహిద్ అఫ్రిదిని అడుగుతున్నాడు. ఎలాంటి సందేహం లేకుండా దీనివల్ల తెలిసిందేమిటంటే షాహిద్ అఫ్రిది పరిణతి పొందేందుకు నిరాకరించాడని, అతడికి సాయం చేసేందుకు ఆన్‌లైన్ కిండర్ గార్డెన్ పాఠాలు ఆర్డరిస్తున్నాను అని గౌతీ ట్వీట్ చేశాడు.

నేను కలిసి పనిచేసిన వారిలో గౌతమ్ గంభీర్‌ది బలహీన మనస్తత్వం. ఎప్పుడూ అభద్రతాభావంతో ఉంటాడని ప్యాడీ అప్టన్ గతంలో పేర్కొన్న ఓ చిత్రాన్ని గంభీర్ ట్వీట్‌కు బదులుగా అఫ్రిది పోస్ట్ చేశాడు. గురువారం ఉదయం గౌతీని విలేకరులు అఫ్రిది ట్వీట్‌పై ప్రశ్నించగా.. కొందరు మనుషులు ఎప్పటికీ ఎదగరు. వారు క్రికెట్ ఆడతారు కానీ వయసుకు రారు. అంతేకాదు వారి బుర్రలు సైతం ఎదగవు అని గంభీర్ ఘాటుగా స్పందించాడు.

## భారతరత్న కోసం యాచించం

న్యూఢిల్లీ : భారత దేశం గర్వించదగ్గ క్రీడాకారుల్లో ప్రథముడు ధ్యాన్‌చంద్. హాకీ స్టిక్‌తో మాయాజాలం చేసి వరుసగా ఒలింపిక్స్‌లో దేశానికి మూడు స్వర్ణాలు సాధించిపెట్టిన గొప్ప క్రీడాకారుడు. అలాంటి వ్యక్తికి ఇంతవరకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వకపోవడంపై ఎప్పటి నుంచో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతూనే ఉంది. ఈ నేపథ్యంలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈ విషయంపై ఆయన కుమారుడు అశోక్ కుమార్ మాట్లాడారు. భారతరత్న పురస్కారానికి నామినేట్ చేయడంలో రాజకీయాలు అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అందుకే తన తండ్రికి ఇంత వరకు దేశ అత్యున్నత పురస్కారం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాం లో జరిగిన ఓ విషయాన్ని చెప్పారు. 'దాదా(ధ్యాన్‌చంద్)కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తూ ప్రధాని మన్మోహన్ సింగ్ ఫైల్‌పై సంతకం చేసి అప్పటి క్రీడాశాఖ మంత్రికి పంపారు. కానీ తర్వాత ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వం మమ్మల్ని కాదు... దేశ ప్రతిష్ఠను పెంచిన గొప్ప ఐకాన్ ను అవమానించినట్టు. అవార్డులను కోరకూడదు. అడగకూడదు. యాచించకూడదు. అవి స్వీకరించే అర్హత ఉన్న వారికి ప్రభుత్వమే అందించాలి. మరి ప్రభుత్వమే నిర్ణయించాలి.. ధ్యాన్‌చంద్ భారతరత్నకు అర్హు డో.. కాదో' అని అశోక్ కుమార్ అన్నారు. బ్రిటీష్ నిబంధలను ఎదురించి 1936 ఒలింపిక్స్‌కు వెళ్లేటప్పుడు సూట్‌కేస్‌లో ధ్యాన్‌చంద్ త్రివర్ణ పతాకాన్ని వెంట తీసుకెళ్లారని ఆయన వెల్లడించారు.

# జమైకా వేదికగా నేటి నుంచి రెండో టెస్ట్

### క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన కోహ్లీ సేన
### బలమైన బ్యాటింగ్, బౌలింగ్ ప్రత్యేకత

జమైకా,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడుతున్న ఇండియా,జమైకాలో రెండో టెస్ట్‌కు నేటినుంచి సిద్దపడుతోంది. ఆంటిగ్వాలోని సర్ వివియన్ రిచర్డ్స్ మైదానంలో జరిగిన మొదటి టెస్టులో ఇండియా విండీస్‌పై భారీ విజయాన్ని నమోదు చేసింది. అన్ని విభాగాల్లో ఆధిపత్యం కొనసాగించిన ఇండియా విండీస్‌ను ఏ విధంగానూ కోలుకోనివ్వలేదు. ఈ విజయంతో ఇండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా 60 పాయింట్లు సాధించింది. ఇదే స్ఫూర్తితో ఇండియా శుక్రవారం జమైకాలోని సబీనా పార్కు మైదానంలో విండీస్‌తో జరిగే రెండో టెస్టులో విజయం సాధించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని ఉవ్విళ్లూరుతోంది. బ్యాటింగ్ విభాగంలో కెప్టెన్ విరాట్‌కోహ్లి(51) , వైస్ కెప్టెన్ రహానే(81, 102) ఫామ్‌లో ఉన్నారు. వారితో పాటు హనుమ విహారి(93), జడేజా(58) టచ్‌లో ఉన్నారు. రోహిత్‌ను కాదని తనను ఎంపిక చేసినందుకు విహారీ తనను తాను నిరూపించుకున్నాడు. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ రాణించాల్సి ఉంది. రాహుల్ పర్వాలేదని పిస్తున్నాడు. వచ్చిన చిక్కల్లా వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్‌తోనే. అతను ఈ పర్యటన మొత్తంలో ఒకే అర్ధ సెంచరీ(65) సాధించగా దాదాపు అన్ని మ్యాచ్‌ల్లోనూ విఫలమవుతున్నాడు. అతడు షాట్ సెలెక్షన్ మార్చుకోవాలని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. ధోనీకి ప్రత్యామ్నయంగా భావిస్తున్న అతను రాణిస్తే ఇండియాకు తిరుగుండదు. బౌలింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. బుమ్రా, ఇషాంత్, షమిలతో కూడిన పేస్ దళం బీభత్సమైన ఫామ్‌లో ఉండగా, స్పిన్నర్లు జడేజా, కుల్దీప్ పర్వాలేదనిపిస్తున్నారు. పార్ట్ టైం స్పిన్నర్ విహారీ సైతం ఆకట్టుకుంటున్నాడు. ఇక వెస్టిండీస్ విషయానికొస్తే, గత టెస్టు మ్యాచ్‌లో కనీసం ఒక్క బ్యాట్స్‌మన్ కూడా అర్ధసెంచరీ చేయకపోవడం వారి బ్యాటింగ్ ఎంత బలహీనంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నో అంచనాలున్న హిట్‌మైర్, డారెన్ బ్రావో, హోప్ సైతం విఫలమవుతున్నారు. బౌలింగ్‌లో కీమర్ రోచ్, గాబ్రియెల్ ఆకట్టుకోగా, వారికి అండగా నిలిచే బౌలర్లు కరువయ్యారు. ఏదేమైనా, ఈ మ్యాచ్‌లో తిరిగి పుంజుకొని, మ్యాచ్ గెలిచి, సిరీస్ సమం చేయాలని విండీస్ ప్రణాళికలు రచిస్తోంది.







### ఆదాయపు రిటర్నులు దాఖలుకు

# నేడే చివరి గడువు

### - ఐటీ రిటర్నులపై వచ్చిన వార్తలన్నీ అవాస్తవం
### - స్పష్టం చేసిన ఐటీ శాఖ అధికారులు

న్యూఢిల్లీ, ఆగస్టు30(ఆంఎన్ఎ) : ఆదాయపు రిటర్నులు దాఖలుకు నేటి(ఆగస్టు 31)వరకే చివరి గడువు అని ఐటీశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆదాయపు రిటర్నులు దాఖలుకు గడువు పెంచుతున్నట్టు వచ్చిన వార్తల్ని ఐటీ శాఖ ఖండించింది. అవన్నీ తప్పుడు వార్తలేనని స్పష్టం చేస్తూ శుక్రవారం ట్వీట్ చేసింది. 2018-19 సంవత్సరానికి సంబంధించి ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పణకు గడువు శనివారం వరకే ఉందని స్పష్టం చేసింది.

కేంద్ర ప్రభుత్వం ఐటీ రిటర్నుల దాఖలు చేసేందుకు మరింత గడువు ఇచ్చిందని.. రిటర్నులు దాఖలు చేసేందుకు మరో నెల రోజులు (సెప్టెంబర్ 30) వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) ఉత్తర్వులు జారీ చేసినట్టు సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి.


దీంతో అప్రమత్తమైన ఐటీ శాఖ అవన్నీ తప్పుడు వార్తలేనని కొట్టిపారేసింది. సాధారణంగా గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించ డానికి చివరి తేదీ జులై 31. అయితే టర్నులు దాఖలు చేసేటప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయని, గడువు తేదీని పెంచాలని పలు వర్గాల నుంచి అభ్యర్థనలు రావడంతో రిటర్నుల దాఖలుకు ఆగస్టు 31 వరకు సమయమిచ్చిన విషయం తెలిసిందే.

### టీఆర్ఎస్ అంటే..

# టెంపరరీ రాజకీయ సమితి

### - కేసీఆర్ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నాడు
### - యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్నా పట్టింపులేదు
### - టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క

ఖమ్మం, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : టీఆర్ఎస్ అంటే టెంపరరీ రాజకీయ సమితి అని తెలంగాణ సీఎల్పీ నేత, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఖమ్మంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెరాస ప్రభుత్వం తీరుపై, కేసీఆర్ అబద్ధపు హామీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. ముఖ్యమంత్రి కేసీఆర్ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని అన్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని భట్టి విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో దోపిడీ చేస్తున్నారని, యూరియా దొరక్క రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భట్టి విక్రమార్క ఆరోపించారు. ఓ ప్రమాదకరమైన వ్యక్తి రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. అప్పులు తెచ్చి ఆస్తులు సంపాదించుకుంటున్నారంటూ విమర్శించారు. రాష్ట్ర ఖజానాను దోపిడీ చేస్తున్న కేసీఆర్ పెద్ద సన్నాసి అని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులపై ప్రజలకు తెలియాల్సిన విషయాలు చాలా ఉన్నాయని, ఇప్పుడు నాలుగు నెలల్లో పాలమూరు ప్రాజెక్టు అంటూ మరో మోసానికి తెరలేపారంటూ భట్టి ఆరోపణలు చేశారు. కాళేశ్వరం పూర్తయిందంటున్న కేసీఆర్, ఆ ప్రాజెక్టు ద్వారా ఎన్ని ఎకరాలను నీళ్లిచ్చారో చెప్పాలని నిలదీశారు. రూ.80 లక్షల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరం కూడా తడవలేదని విమర్శించారు. కాళేశ్వరం బదలు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే 11 లక్షల ఎకరాలకు నీళ్లొచ్చేవని భట్టి అభిప్రాయపడ్డారు. విద్యుత్ శాఖలో అవినీతిపై రేవంత్ రెడ్డి ప్రశ్నించారని, దానికి సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వమే తప్ప ఉద్యోగులు కాదని భట్టి విక్రమార్క అన్నారు. కానీ ప్రభుత్వం సమాధానం ఇవ్వకుండా ఉద్యోగులను తమపై రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగులు రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దని, కేవలం తాము అవినీతి పరులపైనే ఆరోపణలు చేశామని, వారిని వెనకేసుకొని వచ్చి అందరూ అవినీతి మరక అంటించుకోవద్దని భట్టి హితవు పలికారు.




ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెం కస్తూర్బా పాఠశాలలో పుస్తకప్రదర్శన ప్రారంభించిన జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు

## కన్నడ నటుడ్ని చితకబాదిన స్థానికులు

బెంగళూరు, ఆగస్టు30(ఆంఎన్ఎ) : కన్నడ నటుడు హుక్కా వెంకట్ వివాదాస్పదంలో చిక్కుకున్నారు. గురువారం కర్ణాటకలోని నాపోక్లు ప్రదేశంలో ఆయన న్యూసెన్స్ క్రియేట్ చేశారు. కేఎస్ఆర్టీసీ ఎదుట నిలిపి ఉన్న కారును ధ్వంసం చేశారు. అతని ప్రవర్తన చూసిన స్థానికులు నిలదీశారు. మాట వినకపోయేసరికి పట్టుకుని చితకబాదారు. విషయం తెలిసి స్థానిక మీడియా వర్గాలు అక్కడి చేరుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. అయితే ఆయన ఎందుకు అలా ప్రవర్తించారన్న విషయం తెలియరాలేదు. ఒకవేళ తాగి అలా ప్రవర్తించారా.. లేక సదరు కారు యజమానితో వ్యక్తిగత కక్షలు ఏమన్నా ఉన్నాయా అన్న కోణంలో కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట్‌ను కస్టడీలోకి తీసుకుని విచారణ జరుపుతున్నామని ఎస్పీ కొడాగు తెలిపారు.

## పేదలకు అండగా సర్కార్: ఎమ్మెల్యే

సంగారెడ్డి,ఆగస్ట్30 (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే భూపాల రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో మండలంలోని లబ్దిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా వైద్య సేవలకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేశారు. ప్రజలకు అండగా అనేక కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. అన్ని గ్రామాల్లో హరితహారం కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతిగ్రామంలో 40వేల మొక్కలు నాటేలా సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించి మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పర్యావరణహితంతో పండగ సాగాలి: జేసి

నిర్మల్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జేసీ భాస్కర్‌రావుఅన్నారు. అలాగే మట్టి గణపతులకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మరువరాదన్నారు. పర్యావరణహితంగా పండగ జరగాలని ఆకాంక్షించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా 24 గంటల విద్యుత్ అందించాలన్నారు. అన్ని వర్గాల వారు ఐక్యంగా ఉండి ఉత్సవాలను విజయవంతంగా జరుపుకుంటున్నారని అన్నారు. ఎలాంటి వదంతులను నమ్మవద్దన్నారు. శోభాయాత్ర వెళ్లే మార్గంలో మొత్తం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నిమజ్జన స్థలంలో చిన్న, పెద్ద క్రేన్‌లను, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండపాల వద్ద ఎవరో ఒకరు బందోబస్తులో ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అగ్నిమాపక నివారణ పరికాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నవరాత్రుల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో 24 గంటలు పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. మండపాలకు జియో ట్యాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ అవగాహనారాహిత్యం

### పదేపదే అబద్దాలతో తప్పుదోవ పట్టించే యత్నం
### ప్రజలూ వారికి బుద్ధిచెబుతారన్న కొప్పుల

జగిత్యాల,ఆగస్ట్30 (ఆంఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు ఉత్తమ్, జీవన్ రెడ్డి తదితరులు తప్పుడు విమర్శలు చేస్తున్నారని, వారు తమ విమర్శలను ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. తుమ్మడిహట్టిను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు అవగాహన రాహిత్యంతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో తట్టెడు మట్టి కూడా తవ్వని కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టుల పై మాట్లాడడం సిగ్గు చేటైన విషయమని ఆయన పేర్కొన్నారు. టిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంత్రి కొప్పుల ఆ పార్టీ కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ అఖండ విజయం సాధించేందుకు అంకితభావంతో పని చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు. అబద్దాన్ని పదేపదే చెబితే నిజం కాదని , ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గ్రహించాలని ఆయన సూచించారు. పదేళ్లు మహారాష్ట్ర, ఎపిలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మహారాష్ట్రతో ప్రాజెక్టులపై ఒప్పందం చేసుకోలేక పోయిందని ఆయన ధ్వజమెత్తారు కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం ఒక్క పైసా ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం నీరు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని బిజెపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారి తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని కొప్పుల ప్రజలను కోరారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతు లకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. తమది రైతు ప్రభుత్వ మని, రైతుల పంటను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.



సినిమా

# సాహోతో అభిమానుల పండుగ

## కథలో కనిపించని కొత్తదనం




బాహుబలి తర్వాత ప్రభాస్‌తో సినిమా చేయడానికి భిన్న భాషలకు చెందిన అగ్ర దర్శకనిర్మాతలు ఆసక్తిని ప్రదర్శించారు. కానీ ప్రభాస్ మాత్రం వారిని కాదని ఒకే ఒక సినిమా అనుభవమున్న సుజీత్‌ను ఎంచుకొని అందరిని ఆశ్చర్యపరిచారు. సుజీత్‌పై ఉన్న నమ్మకంతో అతడితో సాహో సినిమా చేశారు. దాదాపు మూడు వందల కోట్ల వ్యయంతో స్క్రీన్‌ప్లే ప్రధానంగా రూపొందిన ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, హిందీతో పాటు అన్ని భాషల ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ సినిమా ప్రభాస్ అభిమానులకు పండగలా ఉంది. థియేటర్ల ముందు హడావిడి చూస్తుంటే వారు బాగా ఎంజాయ్చేసేలా ఉన్నారు. ముంబాయిలో వరుసగా దోపిడీలు జరుగుతుంటాయి. తెలివిగా ఓ దొంగ వందల కోట్ల రూపాయల్ని దోచుకుంటూ పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతుంటాడు. దాంతో అతడిని పట్టుకునే బాధ్యతను అండర్‌కవర్ ఆఫీసర్ అశోక చక్రవర్తి (ప్రభాస్) తీసుకుంటాడు. అమృతనాయర్ (శ్రద్ధాకపూర్) అనే ధైర్యవంతురాలైన మహిళా పోలీస్‌తో కలిసి అశోక్ ఆ దొంగ కోసం అన్వేషణ ప్రారంభిస్తాడు. మరోవైపు కిల్లర్ సామ్రాజ్యం వాజి సిటీకి పృథ్వీరాజ్ తర్వాత నాయకుడిగా రాయ్(జాకీష్రాఫ్) ఎదుగుతాడు. అతడి పెత్తనం పృథ్వీరాజ్ కొడుకు దేవరాజ్‌కు కంటగింపుగా మారుతుంది. రాయ్ ఇండియాలో తన సామ్రాజ్యాన్ని విస్తరించాలని అనుకొని ముంబాయి వస్తాడు. అతడిని దేవరాజ్ చంపేస్తాడు. రాయ్‌కు చెందిన రెండువేల కోట్ల రూపాయల డబ్బును దోచుకుంటాడు. తండ్రిని చంపిన వారిని పట్టుకోవడంతో పాటు ఆ డబ్బును తిరిగి స్వాధీనం చేసుకోవడానికి రాయ్ కొడుకు విశ్వక్(అరుణ్ విజయ్) ప్రయత్నాలు మొదలుపెడతాడు. రాయ్ దాచిపెట్టిన ఓ రహస్యం తాలూకు బాక్స్ ఒకటి ఇండియాలో ఉండటంతో దానిని దక్కించుకోవడం కోసం విశ్వక్ బృందంతో పాటు దేవరాజ్ ప్రయత్నిస్తుంటాడు. వారి నుంచి ఆ బాక్స్‌ను సాహో(ప్రభాస్) అనే దొంగ తస్కరిస్తాడు. సాహో ఎవరు? అశోక చక్రవర్తి అనే మారుపేరుతో పోలీసుగా అతడు ఎందుకు డ్రామా ఆడాడు? వాజి సిటీతో పాటు చనిపోయిన రాయ్‌తో అతడికి ఉన్న సంబంధమేమిటి? తన తండ్రి చావుకు కారణమైన వారిపై రాయ్ కొడుకు ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఇదివరకు చాలా సార్లు వెండితెరపై వచ్చిన ప్రతీకార కథ ఇది. ఈ ఇతివృత్తానికి స్క్రీన్‌ప్లే టెక్నిక్, భారీ పోరాట ఘట్టాలతో కొత్తదనాన్ని ఆపాదించాలనే ఆలోచనతో నేల విడిచి సాము చేశారు సుజీత్. ఆ హంగుల్లో అసలైన కథను విస్మరించడంతో సాహో చతికిలపడింది. తండ్రి మరణానికి కారణమైన శత్రువుల్ని తుదముట్టించి అతడి కలను ఓ కొడుకు ఎలా నేరవేర్చాడనే చిన్న పాయింట్‌తో సుజీత్ ఈ కథను రాసుకున్నారు. ఈ అంశానికి దొంగ పోలీస్ డ్రామా, ప్రేమకథను జోడించి చెప్పారు. ప్రథమార్థం మొత్తం నీత్ నితిన్ దేశ్‌ముఖ్‌ను పట్టుకోవడానికి ప్రభాస్ చేసే ప్రయత్నాలు, తమ తెలివితేటలతో ఒకరిపై మరొకరు వేసే ఎత్తులు పై ఎత్తులతో నడిపించారు. ఈ పోలీస్, దొంగ డ్రామాలోనే అంతర్లీనంగా ప్రభాస్, శ్రద్ధాకపూర్‌ల ప్రేమకథను మిళితం చేశారు. ప్రేక్షకుల ఓపికకు అనవసరమైన ఐటెంసాంగ్, నాయకానాయికల రొమాన్స్‌తో పరీక్ష పెట్టాడు దర్శకుడు. కథను ముందుకు సాగించడానికి ఇబ్బందులు పడినట్లు అనిపిస్తుంది. వాజి సిటీకి ప్రభాస్ రావడం, శత్రువులతో పనిచేస్తున్నట్లు నటిస్తూనే వారిని దెబ్బతీసే సన్నివేశాలతో పతాక ఘట్టాల్ని అల్లుకున్నారు. స్క్రీన్‌ప్లే సినిమాల్లో వేగం చాలా ముఖ్యం. అందుకు భిన్నంగా ఈ సినిమా కథ పూర్తిగా సాగతీత ధోరణిలో సాగుతుంది. కథ,లాజిక్‌ల కంటే ప్రభాస్ ఇమేజ్, గ్రాండియర్‌గా సినిమాను

రూపొందించడంపైనే దృష్టిసారించారు. ఏ పాత్ర ఎందుకు వస్తుందో, ఎలా ప్రవర్తిస్తుందో అర్థం కాదు. సినిమాతో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యే ఎమోషన్స్ కనిపించవు. హాలీవుడ్ వారితో పోటీపడుతూ వారి ప్రమాణాలకు తగిన సినిమా తీయాలనే ఆలోచన మంచిదే. అయితే అందుకు తగ్గ మంచి కథను సిద్ధం చేసుకుంటే బాగుండేది. బాహుబలి తర్వాత ప్రభాస్ ఎలాంటి కథ, కథనాలతో సినిమా చేస్తాడోనని అన్ని వర్గాల ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ కథలోని వైవిధ్యత కంటే సాంకేతికంగా ఉన్నతమైనమైన సినిమా చేయడానికే ప్రభాస్ ప్రయత్నించారు. సగటు ప్రేక్షకుల్ని ఆకట్టుకునే అంశాలు ఈ సినిమాలో కనిపించవు.

# మళ్లీ గ్లామర్ పాత్రలో శ్రియ




ఒకప్పుడు తెలుగులో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులని అలరించిన అందాల భామ శ్రియ సరన్. చివరిగా గౌతమపుత్ర శాతకర్ణి చిత్రంతో పలకరించిన ఈ అమ్మడు ప్రస్తుతం పలు తమిళ సినిమాలతో బిజీగా ఉంది. దాదాపు 2 ఏళ్ళ తర్వాత కోలీవుడ్‌లో సండకారి అనే సినిమా చేస్తుంది. విమల్ లీడ్ రోల్ పోషిస్తున్నాడు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని కొద్ది సేపటి క్రితం విడుదల చేశారు మేకర్స్. ఇందులో వీరిద్దరిని చూస్తుంటే కార్పొరేట్ కంపెనీలో పని చేసే ఉద్యోగులులా కనిపిస్తున్నారు. ఆర్ మదేష్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. బాస్ ప్రొడక్షన్ కార్పొరేషన్ బేనర్‌లో రూపొందుతున్న ఈ చిత్రం అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. పోస్టర్‌లో శ్రియని చూస్తుంటే ఈ అమ్మడు చాలా రోజుల తర్వాత తన గ్లామర్‌తో అలరించనుందని తెలుస్తుంది

## సరోగసీ ఆధరంగా కృతి సనన్ చిత్రం

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ తెలుగు ప్రేక్షకులకి చాలా సుపరిచితం. 1 నేనొక్కడినే చిత్రంలో మహేష్ సరసన నటించిన ఈ అమ్మడు ఆ తర్వాత పలు సినిమాలు చేసింది. తాజాగా దినేష్ విజన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న మిమి అనే సినిమా చేస్తుంది. సరోగసి ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ తన ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ద్వారా షేర్ చేసింది కృతి. పోస్టర్‌లో మనం రెండు చేతులు గమనించవచ్చు. ఒక చేతిలో శిశువు ఉండగా, ఆ చేయి బేబిని ఇచ్చేందుకు సిద్ధం అన్నట్టుగా ఉంది. మరో శిశువు స్వీకరించడానికి వేచి చూస్తున్నట్టుగా ఉంది. జీవితం ఊహించని అద్భుతాలతో నిండిన ప్రయాణం.. మునుపెన్నడు లేని విధంగా ఓ ప్రయాణానికి సిద్ధం కండి. మిమి .. చాలా ప్రత్యేకమైనది అని కృతిసనన్ తన కామెంట్‌లో తెలిపింది. మిమి చిత్రం మరాఠీ మూవీ మాలా ఐ వైచై ఆధారంగా రూపొందుతుంది. లుకా చుప్పి దర్శకుడు లక్ష్మణ్ ఉతేకర్ దర్శకత్వం వహించిన మిమి చిత్రంలో పంకజ్ త్రిపాఠి లీడ్ రోల్ పోషిస్తున్నారు. ఈ మూవీని దినేష్ విజన్, మాడాక్ చిత్రాలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# కాశ్మీర్ లోయలో మళ్లీ ఆంక్షలు


### ప్రజా రవాణా, మార్కెట్లు మూత భద్రత కట్టుదిట్టం చేసిన పోలీసులు

శ్రీనగర్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లో మళ్లీ ఆంక్షలు విధించారు. శుక్రవారం ప్రార్థనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కశ్మీర్‌లోయలోని పలు ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. గత 26 రోజులుగా కశ్మీర్‌లో పరిస్థితి ఇలాగే ఉంది. ప్రజా రవాణా, మార్కెట్లు మూత పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో ఫోన్ సర్వీసులపై ఆంక్షలు సడలించినప్పటికీ.. మరికొన్ని ప్రాంతాల్లో కొనసాగుతూ ఉన్నాయి. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యల నేపథ్యంలో ఆగస్టు 5 నుంచి కశ్మీర్‌లో ఆంక్షలు కొనసాగుతున్నాయి. భారత్‌లోకి పాక్ కమాండోలు ప్రవేశించారన్న వార్తల నేపథ్యంలో మరింత కట్టుదిట్టం చేశారు. భారత ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ ఈరోజు శ్రీనగర్‌లో పర్యటించనున్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఆయన కశ్మీర్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. ఇందులో భాగంగా కశ్మీర్‌లో భద్రతా తీరును ఆయన పర్యవేక్షించనున్నారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌పై పాక్ కయ్యానికి కాలు దువ్వుతోంది. అంతర్జాతీయంగా భంగపడ్డ పాకిస్థాన్- ప్రాంతీయంగా చిచ్చు కొనసాగించే ప్రయత్నాలు చేస్తోంది. దీంతో నియంత్రణ రేఖ వద్ద రేయింబవళ్లూ భారత సైన్యం అప్రమత్తంగా ఉంది. వేయికళ్లతో పాక్ భూభాగం నుంచి కదలికలను పరిశీలిస్తోంది. పాక్ నుంచి సముద్ర మార్గంలో ఉగ్రవాదులు చొరబడినట్లు అనుమానిస్తోంది. దీంతో అప్రమత్తమై గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీ విధ్వంసం, ప్రాణనష్టం లక్ష్యాలుగా పాక్ నుంచి సుశిక్షితులైన టెర్రరిస్టులు గుజరాత్ తీరానికి చేరినట్లు 27నే నిఘావర్గాలు హెచ్చరించాయి. దీంతో కాండ్లా, ముంద్రా నౌకాశ్రయాల్లో భద్రతను రెట్టింపు చేశారు. కచ్ జిల్లాలోని జామ్‌నగర్, వాదినర్ ఆయిల్ రిగ్ ÷నైరీల వద్ద హైఅలర్ట్ ప్రకటించారు. మరోవైపు పీవోకే కూడా భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేశారు. ఏదో ఒక రోజు పీవోకే, గిల్గిత్-బాల్టిస్థాన్‌లు కూడా భారత్‌లో కలిసిపోతాయని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ జమ్మూకశ్మీరు విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు 2021లో నిర్వహించే అవకాశాలున్నాయని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. కొత్తగా ఏర్పడిన కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అక్టోబరు 31 తర్వాత మొదలవుతుందని, పూర్తి కావడానికి 10 నుంచి 15 నెలలు పడుతుందని ఆ వర్గాలు వివరించాయి.

# భువనగిరిలో రాస్తారోకో: కోమటిరెడ్డి అరెస్ట్

యాదాద్రి భువనగిరి, ఆగస్ట్ 30(ఆర్ఎన్ఎ): భువనగిరి ఎంపి, కాంగ్రెస్ అగ్రనేత కోమటరెడ్డి వెంకట్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భువనగిరి జడ్ పి కార్యాలయం ఎదుట తమ పార్టీ కార్యకర్తలతో కలిసి రాస్తారోకో చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. రాస్తారోకో చేస్తున్న కోమటిరెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా, కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో వెంకట్ రెడ్డిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు.

# అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి నటి ఆత్మహత్య



ముంబయి, ఆగస్టు30(ఆర్ఎన్ఎ) : అపార్ట్ మెంట్‌పై నుంచి దూకి ముంబయికి చెందిన వర్ధమాన నటి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం అర్థరాత్రి చోటుచేసుకుంది. నటి పెరల్ పంజాబీ చిత్ర పరిశ్రమలో నటిగా బ్రేక్ రాలేదని తీవ్ర మనస్తాపానికి గురై.. ఆత్మహత్య చేసుకుంది. తను ఉంటున్న అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. పెరల్ చాలాకాలంగా నటిగా బ్రేక్ తెచ్చుకోవడానికి ప్రయత్నిసున్నారని, కానీ అది జరగకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. పెరల్ ముంబయిలోని ఓషివారా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఆమె మానసిక స్థితి బాలేదు. తల్లితో ఆమెకు తరచూ గొడవలు జరుగుతుండేవి. గతంలోనూ రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించారు. కానీ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. గురువారం రాత్రి 12 గంటల సమయంలో ఓషివారా అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ గార్డ్ బిపిన్ కుమార్ ఠాకూర్‌కు ఏదో శబ్దం వినిపించింది. రోడ్డుపై ఎవరో అరుస్తున్నారనుకుని.. వెళ్లి చూసొచ్చాడు. ఇంతలోపే మూడో అంతస్తు నుంచి కేకలు వినిపించాయి. పెరల్ అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకారు. తీవ్రంగా గాయాలు కావడంతో మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దారుణ హత్య

### స్నేహితుడిపై అనుమానంతో దర్యాప్తు

హైదరాబాద్,ఆగస్ట్ 30 (ఆర్ఎన్ఎ): నగరంలోని కూకట్‌పల్లి కె.పి.హెచ్.బి. కాలనీలో సతీష్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మూసాపేట్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కె.పి.హెచ్.బి. కాలనీలోని సతీష్ స్నేహితుడే గొంతు నులిమి హత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు స్వస్థలం ప్రకాశం జిల్లా మార్టూరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రకాశం జిల్లా మార్టూరుకి చెందిన సతీష్ ఐటీ స్లేట్ సొల్యూషన్స్ అనే కంపెనీ స్థాపించి తనతో పాటు హేమంత్ అనే పార్టనర్‌తో నడుపుతున్నాడు. అయితే నిన్న ఇంటికి రాకపోవడంతో భార్య ప్రశాంతి కె.పి.హెచ్.బి. పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. సతీశ్ అదృశ్యమైనట్లు ఈ నెల 28న కేపీహెచ్‌పీ పోలీసుస్టేషన్‌లో ఆయన భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు వెతికే క్రమంలో కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో హేమంత్ ఉంటున్న గదిని సతీశ్ భార్య వారికి చూపించింది. పోలీసులు, సతీశ్ భార్య అక్కడికి వెళ్లి పరిశీలించి గదికి తాళాలు వేసి ఉన్నట్లు గమనించారు.

అనుమానించిన పోలీసులు తలుపులు పగులగొట్టి చూసేసరికి సతీశ్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ విషయమై సీఐ లక్ష్మీనారాయణను వివరణ కోరగా సతీశ్‌ను తన మిత్రుడు హేమంతే కొట్టి చంపినట్లు ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం హేమంత్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. వ్యాపార లావాదేవీ లే హత్యకు కారణంగా తెలుస్తోంది.

## నగరంలో భారీ హరితహారం కార్యక్రమం

ఖమ్మం,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో హరితహారం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్య ప్రారంభించారు. 49వ డివిజన్ రామన్నపేటలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో మేయర్ డాక్టర్ పాపాలాల్, నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ జగన్ మొక్కలు నాటారు. అనంతరం స్థానికులు డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో 300 మొక్కలను వీధులకు ఇరువైపుల నాటారు. 33వ డివిజన్ ఖానాపురంలో నిర్వహించిన కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ శీలంసెట్టి రమా ప్రారంభించారు. 9వ డివిజన్ రోటరీనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ ఖాజాదీ, 50వ డివిజన్ దానవాయి గూడెంలో కార్పొరేటర్ పీట్ల సక్కుభాయి ప్రారంభించారు.

# కాళేశ్వరంతో చెరువులకు మహర్దశ

కరీంనగర్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం నీటితో చెరువులకు జలకళ వచ్చిందనీ, గ్రామాలన్నీ సస్యశ్యామ లం అవుతాయని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మిడ్ మానేర్ నుంచి లెఫ్ట్ కెనాల్ నిర్మాణం చేశారనీ, కొడిపెకుంట వద్ద భూమి సర్వేపైన పలు అనుమానాలతో ఏడాది కింద రైతులు పనులను అడ్డుకున్నారని తెలిపారు.

కాగా, వారిని ఒప్పించి ఎస్ఈ శ్రీకాంత్ ద్వారా నష్టపరిహారం అందించేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. దాదాపు 220 మీటర్ల కాలువ పనులను కాంట్రాక్టర్లు మరో వారంలో పూర్తి

చేస్తారన్నారు. ప్రస్తుతం నాగుల మల్యాల చెరువు, కొండాపూర్ చెరువుల నుంచి బావుపేట, ఎలగందులకు నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఆరు గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయనీ, రైతులకు ఎలాంటి నీటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆరుగ్రామాల ప్రజలు ఎల్లప్పుడికీ రుణపడి ఉంటారని ఎమ్మెల్యే గంగుల చెప్పారు. అలాగే హరితహారంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, హరితహారం విజయవంతం కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# రోడ్లకు నిధులిచ్చి ఆదుకోండి

### -గడ్కరీని కోరిన స్పీకర్ పోచారం

న్యూఢిల్లీ,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. స్పీకర్ పోచారం గురువారం ఢిల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో వివిధ రోడ్లను జాతీయ ప్రాజెక్టులుగా చేపట్టాలని కోరారు. ముఖ్యంగా బోధన్ గుండా వెళ్లే రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆయన గడ్కరీకి వివరించారు. అన్ని విధాల అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు నిధులు ఇచ్చి ఆదుకోవాలని ఆయన గడ్కరీని కోరారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.